ప్రజాశక్తి

Vol. 3, no. 13

(Sept. 29, 1943)

బెజవాడ, 1943

Record no. 683

Prajāśakti

Vol. 3, no. 13

(Sept. 29, 1943)

Bejavāḍa, 1943


Record no. 683

0-2-0 Regd. No. M. 4486

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 3 సంచిక 13	: సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ	★	పుచ్చలపల్లి సుందరయ్య తమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు	బుధవారం 29 9 43



★ సోదర దేశభక్తులకు విజ్ఞప్తి ★

మద్దుకూరి చంద్రశేఖరరావు

1942 ఆగస్టులో జపాను దురాక్రమణదారుల దండయాత్రా ప్రమాదం హెచ్చుగా వున్నప్పుడు బ్రిటిషు సామ్రాజ్య వాదులు జాతీయోద్యమముపై దాడివెడలారు. బొంబాయి అఖిల భారత కాంగ్రెసు చేసిన "జాతీయ వాంఛ నెరవేర్చనిచో సత్యాగ్రహం" అనే తీర్మానభాగాన్ని వినియోగించుకొని కాంగ్రెసు మహాసభపై బ్రిటిషు ప్రభుత్వం దెబ్బకొట్టింది. భారత దేశానికి జపానుదండయాత్రా ప్రమాదం సిద్ధంగా వున్నప్పుడు కాంగ్రెసు జపాన్ ఫాసిస్టులకు వినియోగపడే పోరాటాన్ని తెస్తూందని ప్రభుత్వం ఆరోపించింది. జాతీయ నాయకులను అరెస్టుచేసింది. జాతీయ కాంగ్రెసే జపాను అనుకూలంగా మారిందని అమెరీ అండ్ కంపెనీ దుష్ప్రచారం చేయబూనుకొంది.

కాని నిజం ఏమిటి? కాంగ్రెసు చేసిన బొంబాయి తీర్మానం 'దేశరక్షణ జయప్రదంగా జరపడానికే జాతీయ ప్రభుత్వం కావాలని' కోరింది. ఫాసిస్టు దుండగీడులకు వ్యతిరేకంగా మిత్రరాజ్యాల విజయాన్ని అపేక్షించింది. మిత్రరాజ్యాలకు తగినంతగా సాయపడడానికి, జయప్రదంగా ప్రజలు యుద్ధకృషి జరపడానికి జాతీయ ప్రభుత్వం యివ్వాలని హెచ్చరించింది. కాని అలా జాతీయ ప్రభుత్వానికి యుద్ధనిర్వహణాధికారం అప్పగించనిచో సత్యాగ్రహం చేస్తానని హెచ్చరించింది. సత్యాగ్రహ భాగాన్ని సాకుగా తీసుకొని ప్రభుత్వం కాంగ్రెసుపై దెబ్బ కొట్టింది.

జాతీయనాయకుల అరెస్టులు కాంగ్రెసు దేశభక్తులను రెచ్చగొట్టింది. దెబ్బకు దెబ్బ కొట్టాలనే రోషంతో వారు బయలుదేరారు. సమయంకొరకు వేచియున్న పంచమాంగ దళం, ఫార్వర్డుబ్లాకు, విధ్వంసక చర్యలను ప్రోత్సహించాయి. నాయకుల అరెస్టులతో రెచ్చగొట్టబడిన దేశభక్తులు, ప్రజలు అనేకమంది అరాజకచర్యలలో పాల్గొన్నారు. వీరి చర్యలు కాంగ్రెసు తీర్మాన ఆశయాలయిన యుద్ధకృషికి, మిత్రరాజ్యాల విజయానికి విరుద్ధంగా పరిణమించాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వీటిని సాకుగా చూపుతూ కాంగ్రెసే విధ్వంకసకచర్యలను ప్రోత్సహించిందని నిందలువేయ సాగించారు.

కమ్యూనిస్టులం ఆసమయంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కుట్రను బట్టబయలుచేశాం. కాంగ్రెసు మిత్రరాజ్యాల విజయసాధనకొరకే జాతీయప్రభుత్వాన్ని కోరిందని స్పష్టపరచాం. ఫార్వర్డుబ్లాకు వగయిరా జపాను యేజెంట్ల వలలోపడవద్దనీ, విధ్వంసకచర్యలు కాంగ్రెస్ కార్యక్రమం గాదని దేశభక్తులను హెచ్చరించాము.

కాంగ్రెసు పేరుతో పంచమాంగదళం

కాంగ్రెసు నాయకులందరిని ప్రభుత్వం జైళ్ళలో పెట్టుటచే కాంగ్రెసు నిర్మాణం బయటదిగబడిన పంచమాంగదళ గ్రూపుల చేతులలో పడింది. వీరు కాంగ్రెసు పేరును తమ దేశద్రోహ కార్యాలకు వినియోగించుకోసాగారు. కాంగ్రెసు పేరుతో ప్రజలనుండి డబ్బు వసూలుచేసి పత్రికలుపెట్టి విధ్వంస కార్యక్రమాన్ని ప్రచారం చేయపూనుకొన్నారు. అఖిలభారత కాంగ్రెసు పేరున జయప్రకాశనారాయణ, అచ్యుత్ పట్వర్ధన్, రాంమనోహర్ లోహియాలు రహస్య పత్రికలు నడుపుతూ కాంగ్రెసు పలుకుబడిలో వున్న ప్రజలను విధ్వంసక చర్యలవైపు ఆకర్షింప జూచారు. ఆంధ్రరాష్ట్రంలో 'రణగర్జన' అను రహస్య పత్రికను రాష్ట్ర కాంగ్రెసు పేరుతో ఫార్వర్డుబ్లాకు, కాంగ్రెసు సోషలిస్టు పార్టీలకు చెందినవారు నడుపసాగారు.

ఈ రహస్య కరపత్రాలలో, బాంకాక్, సైగాన్‌లనుండి ప్రకటించబడే రేడియోవార్తలను వినమని ప్రచారం చేశారు. దీనిపై ప్రజాశక్తి 11-11-42 సంచికలో కాంగ్రెసు పేరును ఏవిధంగా పంచమాంగదళముఠాలు దుర్వినియోగం చేస్తున్నాయో దేశభక్తులను హెచ్చరించాము. విధ్వంసకుల నుండి కాంగ్రెసు దేశభక్తులను వేరుచేయడానికి ప్రయత్నించాము. మొదటలో ఫార్వర్డుబ్లాక్, కాంగ్రెసు సోషలిస్టులచే దగాచేయబడిన దేశభక్తులు మా హెచ్చరికను సరిగా అర్ధంచేసి కోకపోయినా, ఆలోచించునట్లు చేసింది.

ఇంతలో 1943 ఫిబ్రవరి గాంధీజీ ఉపవాస సమయంలో గాంధీ- వైస్రాయ్ లేఖలు ప్రకటించబడ్డాయి. అవి కాంగ్రెసు మిత్రమండలి విజయాన్నే కోరిందనీ, యుద్ధకృషిని జయప్రదంగా నిర్వహించడానికే జాతీయ ప్రభుత్వాన్ని కోరిందనీ స్పష్టపరచాయి. యుద్ధ కృషికి నష్టం కలుగచేయడం కాంగ్రెసు పాలసీకాదనీ, విధ్వంకచర్యలు కాంగ్రెసు కార్యక్రమంకాదనీ తేటతెల్లంజేశాయి. ఉపవాససమయంలో పంచమాంగదళం దేశభక్తులను రెచ్చగొట్టి మరల అరాజకచర్యలు రేగునట్లు చేయడానికి ప్రయత్నించింది. కాని గాంధీజీ లేఖలద్వారా విధ్వంసక చర్యలు కాంగ్రెసు కార్యక్రమం కాదని తెలసికొన్న దేశభక్తులు యీసారి వీరివలలో పడలేదు. క్రమంగా పంచమాంగదళం చెప్పే అరాజక కార్యక్రమానికి దేశభక్తులలోనూ, ప్రజలలోనూ కూడ తావులేకుండా పోయింది.

పంచమాంగదళం కొత్త ఎత్తులు

"పర్వతం మహమ్మద్ దగ్గరకు రాకపోతే మహమ్మదే పర్వతంవద్దకు వెళ్ళవలసి వుంటుంది" అనే సామెత వుంది. అదే విధంగా పోరాటం విఫలమయిందని నిరుత్సాహ పడి కూర్చున్న దేశభక్తులను తమవైపుకు లాగడానికి కొత్త నినాదాలు లేవదీసింది పంచమాంగ దళం. తామెంత రెచ్చగొట్టినా విధ్వంసక చర్యలకు దేశభక్తులు ముందుకు రావడంలేదు. అందుచే కాంగ్రెసువాదులకు నమ్మకం కలిగించే సత్యాగ్రహ నినాదాలతో బయలుదేరింది. అఖిలభారత కాంగ్రెసు పేరుతో కాంగ్రెసు సోషలిస్టులు ఆగస్టు 9 వార్షికోత్సవానికి కొత్త కార్యక్రమమిచ్చారు. ఆగాఖాన్ భవనానికి సత్యాగ్రహ దండయాత్ర వెళ్ళాలనీ, ప్రతిపట్టణంలో హర్తాళులు, సమ్మెలు జరపాలని నినాదమిచ్చారు. విధ్వంసక చర్యల నినాదంతో ఆకర్షించలేని దేశభక్తులను, సత్యాగ్రహ నినాదాలతో తమవైపుకు లాగాలని వేసిన పంచమాంగ దళ యెత్తు యిది.

ఆంధ్ర రాష్ట్రంలో రాష్ట్రకాంగ్రెసు పేరున పంచమాంగదళ ముఠాలయిన కాంగ్రెసు సోషలిస్టులు, ఫార్వర్డుబ్లాకువారు, రంగాముఠాలోని కొందరు ప్రకటించుతున్న 'రణగర్జన' యింకో అడుగు ముందుకు పోయింది, ఆగష్టు ప్రారంభంలో పంచబడిన సంచికలో వీరు వార్షికోత్సవ కార్యక్రమాన్నిచ్చారు. టెలిగ్రాఫ్, టెలిఫోన్ తీగెలు తెంచడం, గవర్నమెంటు భవనాలు స్వాధీనం చేసుకోవడం లేదా ధ్వంసంచేయడం వీరి కార్యక్రమం. కాని దేశభక్తులు ప్రజలూ, ఎవరూ వీరిని అనుసరించలేదు. కాంగ్రెసు దేశభక్తులు అనేకమంది 'రణగర్జన' పత్రిక తోనూ, దాని కార్యక్రమంతో తమకు సంబంధం లేదని కామ్రేడ్స్ ముందు అంగీకరించారు. దేశ భక్త కొండా వెంకటప్పయ్యగారు, వర్కింగుకమిటీ సభ్యురాలైన సరోజినీదేవి, కాంగ్రెసు పేరుతో రహస్య పత్రికలు ప్రకటించడానికి, కార్యక్రమం యివ్వడానికి, ఎవరికీ అధికారం లేదని ఆలా ప్రకటించ బడే వానితో కాంగ్రెసుకెట్టి సంబంధంలేదనీ ప్రకటించారు. దీనితో కాంగ్రెసు పేరుతో రణగర్జన ప్రకటించుతూ, దేశభక్తులను పంచమాంగదళ కార్యక్రమం వైపు ఆకర్షింప చూచిన ఫార్వర్డుబ్లాకు, కాంగ్రెసుసోషలిస్టుల ఎత్తు విఫలమయింది.

'రణగర్జన' కార్యక్రమం తమదేనని విర్రవీగిన భూపతి కోటేశ్వరరావు; "బోసుకు జై! పంచమాంగదళానికి జై" అని కేకలువేసిన (వణుకూరు సభలో) మైనేని రామకోటయ్య, చివుకుల వెంకటేశ్వర్లు పై కార్యక్రమంతో కాంగ్రెసు దేశభక్తులను ఆకర్షించలేక పోయారు. తమ అఖిలభారత నాయకులు రంగుమార్చినట్లుగానే తాముకూడా కొత్త నినాదాలతోనే ముందుకు రాసాగారు. వీరి కొత్త కార్యక్రమం ఏమిటి? కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా కాంగ్రెసు దేశభక్తులను రెచ్చగొట్టడం. కాంగ్రెసువాదులందరిని పంచమాంగదళమంటున్నారని కమ్యూనిస్టులమీద నిందలు వేయడం. కమ్యూనిస్టులపై ద్వేషం రెచ్చగొట్టి దేశభక్తులను, తమ కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టడానికి వినియోగించడం. ప్రతి ప్రజాసంస్థకు వ్యతిరేకంగా, ప్రతిద్వంద్విగా, సంస్థలను నిర్మించి ప్రజాఉద్యమాలను చీల్చడం. ఇదే వీరి కార్యక్రమం.

ఆంధ్రలో జైళ్ళనుండి విడుదలై వచ్చిన కాంగ్రెసు దేశభక్తులను తమవలలో వేసికోడానికి నూతన ఎత్తుగడలతో ముందుకొచ్చారు. ఇందుకోసం 1942 ఆగస్టు సంఘటనలలో తలఎత్తిన జాతీయ విద్యార్థి సంఘాలను, జాతీయ యువజన సంఘాలను పునరుద్ధరించ పూనుకొన్నారు. వేయేల ఇపుడు, పనిజేస్తున్న ప్రజా సంస్థలన్నిటికి ప్రతిద్వంద్విగా సంస్థలను నిర్మించడం, ప్రజాఉద్యమాలను చీల్చడమే వీరి ఆశయం. అందుకొరకు కాంగ్రెసు దేశభక్తులలో కమ్యూనిస్టులపై ద్వేషాన్ని రేగగొట్టడం ఒక సాధనం. ప్రజలవద్దకుపోయి గాంధీగారి పేరును, కాంగ్రెసుపేరును వినియోగించి తమ సంస్థలలో చేరమని కోరడం. కమ్యూనిస్టులచే నడుపబడుతున్న ప్రజాసంస్థలలో చేరవద్దని ప్రచారంచేయడం, ఇదే వీరి కార్యక్రమం. "గాంధీగారి సంస్థలో జేరతావా? కమ్యూనిస్టుల సంస్థలో చేరతావా?" అనే దగామంత్రంతో అమాయకులను మోసపుచ్చాలని వీరియెత్తు. కమ్యూనిస్టులు బలపడకుండా తమకు సాయపడుతున్నారని దేశభక్తులనుకొని తమతో చేరతారని వీరి ఆశయం.

అందుకొరకు వీరు కాంగ్రెసు వర్కర్ల సమావేశాలకు హాజరయ్యారు. కృష్ణాజిల్లాలో జరిగిన సభలో (ఆగస్టులో) యువజన, విద్యార్థి ఉద్యమాలను చీల్చాలని తీర్మానించారు. రైతు, వ్యవసాయకూలీ సంఘాలకు వ్యతిరేకంగా పని చేయాలనుకొన్నారు. ఈ కార్యక్రమాన్నంతటినీ జపాన్ ఏజంట్ల కార్యక్రమంతోపనిజేస్తున్న భూపతి కోటేశ్వరరావు, మైనేని రామకోటయ్య నాయకత్వం వహించి నడిపించారు. పశ్చిమకృష్ణా దేశభక్తుడు ఒకరు పైవారు నిజమైన కాంగ్రెసువాదులేనా అని ప్రశ్నించారు. వానికి తూర్పు కృష్ణానుంచి వచ్చినవారు, పూర్వంనుంచీ గాంధీభక్తుడుగా పరిగణించబడుతున్న ఎర్నేని సుబ్రహ్మణ్యం గారు కాంగ్రెసువాదేనని హామీ యిచ్చారట. ఈసభలో జరిగిన యింకోతీర్మానం ఏమంటే ఇపుడు ఆహారకమిటీలలో వున్న కాంగ్రెసు వాదులచే రాజీనామా పెట్టించి ప్రత్యేకఆహార కమిటీలను స్థాపించాలని. ఇంతకు పూర్వం పంచమాంగదళం షాహుకార్లను ధాన్యం బయటపెట్టకుండా దాచమనీ, బీదలను దోచుకోమని రెచ్చగొట్టేది. దేశంలో అంతఃకలహాలు, అరాజకం వ్యాపించడానికి సూటిగా ప్రయత్నించేవారు. ఈనిబిదం ప్రజల ఆకలి మంటలను కండ్లారా చూస్తున్న దేశభక్తులను ఆకర్షించలేదు. వారిలో ప్రజలకు తమకు చేతనయినంత సాయం చేయాలనే ఆవేదన బయలుదేరింది. అందుచేతనే అనేకమంది కాంగ్రెసువాదులు (జయంతిపురం జమీందారుగారు, సి. రాజగోపాలాచారి, ఘంటసాల సీతారామశర్మ, కాట్రగడ్డ నారాయణరావుగార్లువగైరా) కమ్యూనిస్టులతో కలిసి ఆహార కమిటీలలో పనిచేస్తున్నారు. ఇది పంచమాంగదళానికి గిట్టలేదు. అందుచే ప్రత్యేక ఆహారకమిటీల పేరుతో కాంగ్రెసువాదులను యితర దేశభక్తులనుండి, ముస్లింలీగ్—కమ్యూనిస్టుపార్టీవగైరా యితర రాజకీయపార్టీలనుండి వేరుజేసి తమవైపు లాక్కోడానికి పూనుకొంటున్నారు.

ఈ సభలో ముఖ్యుడుగా పాల్గొన్న మైనేని రామకోటయ్య ఈడ్పు (మిగతా 8 వ పేజీ)

బుధవారం ప్రజాశక్తి 29-9-43

ఆహారసమస్య : గ్రిగరీకమిటీ సిఫార్సులు

ఎట్టకేలకు, ఆహారసమస్యను పరిష్కరించుటకై నియమించబడ్డ గ్రిగరీ కమిటీ, ఇండియా ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు చేసింది.

ధరలను నిర్ణయించేటప్పుడు, సరకులను పంపకం చేసేటప్పుడు, ప్రభుత్వరిజర్వును మేనేజ్ చేసేటప్పుడు, కేంద్రప్రభుత్వానికే అంతిమ నిర్ణయాధికారం ఉండాలని గ్రిగరీకమిటీ సిఫార్సుచేసింది. ఒక్కొక్క రాష్ట్రం ప్రత్యేకంగా ఆహారసమస్యను పరిష్కరించుకోవడంలో ఎన్నెన్ని ఆటంకాలు, ఎన్నెన్ని తికమకలు, ఎంతెంతటి సాహసకృత్యాలు, జరిగాయో గత అసెంబ్లీ చర్చలవల్ల స్పష్టమయింది. అట్టి విధానానికి యిక స్వస్తిచెప్పి, కేంద్రప్రభుత్వానికే ధరలనిర్ణయం, సరకుల పంపకం, మొదలైన సమస్యలపై అంతిమ నిర్ణయాధికారం ఉండాలని సూచించడం ప్రశంసించదగిన విషయం.

1 లక్షకంటె యెక్కువ జనాభాగల పట్టణాలన్నింట్లోను రేషనింగ్ ప్రవేశపెట్టి, ప్రతి వ్యక్తికి రోజూ కనీసం ఒకపౌనుబరువుగల ఆహారపదార్థాలు లభించేటట్లు చూడాలని గ్రిగరీ కమిటీ సిఫార్సుచేసింది. కరువు పరిస్థితులేర్పడ్డ పల్లెప్రాంతాలలో ఆహారపదార్థాల పంపకం వర్తకులచేతులలో విడిచిపెట్టకుండా, ప్రభుత్వమే తగిన యేర్పాట్లుచేయాలని సూచించింది అన్నిరాష్ట్రాలలోను, అన్ని సంస్థానాలలోను, ఆహారపదార్థాల ధరలను కంట్రోలు చేయడం అవసరమని కూడా అభిప్రాయమిచ్చింది. ఈ సూచనలు అమలు జరిగితే, తిండి దొంగల దోపిడీ వ్యాపారం చాలావరకు అణుగుతుంది. వీటికై ప్రజాసంస్థలు ఎంతో కాలంనుండి ఆందోళన చేస్తున్నాయి.

ఇకమీదట దేశంనుండి సరుకును యెగుమతిచేయరాదనీ, ఇతర దేశాలనుండి మొదటి సంవత్సరం 15 లక్షలటన్నులు, తరువాత ప్రతిసంవత్సరం 10 లక్షల టన్నులు, దిగుమతి అయే ఏర్పాట్లుచేయాలనీ, ఇండియాప్రభుత్వానికి గ్రిగరీకమిటీ సిఫార్సుచేసింది. వెంటనే ఇలా జరిగితే, దేశంలో సప్లయిలు యెక్కువై, చాలావరకు కరువుబాధ తొలగగలదు.

మొదటి సంవత్సరంలో దిగుమతిఅయే 15లక్షలటన్నులలో 5లక్షల టన్నులురిజర్వుగా ప్రత్యేకించ బడాలనీ, అట్టి రిజర్వు లేకపోతే ధరల కంట్రోలును అమలుపరచడం బహు కష్టంఅనీ, గ్రిగరీకమిటీవారి అభిప్రాయం. రిజర్వుఉంటే, ధాన్యాన్ని సేకరించడంకూడా సులభమవుతుందట. ఎందువల్లనంటే, ప్రభుత్వం మార్కెట్టులో ఎంతకు పడితే అంతకు కొనవలసిన అవసరం ఉండదట. దీనిఅర్థంఏమిటి? కంట్రోలు ధరలకు పైబడి అమ్మే తిండిదొంగల విషయంలో ప్రభుత్వంఇంకా ఉదాసీనతతోనే మెలగుతోంది. వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడానికి జంకుతోంది. మరోవిషయం. రిజర్వుఏర్పడినా, దిగుమతులెన్నివచ్చినా, స్టాకులపై తగిన కంట్రోలు లేకపోతే, యీ ప్రయత్నమంతా వృధా. ఆహారపదార్థాలను సేకరించడానికి ఇప్పుడున్న విధానంకంటె మంచి విధానమొకటి ఉండాలని గ్రిగరీకమిటీ అంగీకరించిందేగాని, అదియెలా ఉండాలో, దాన్నినడిపేది ఎవరో, మొదలైన ప్రధాన విషయాలపై ఎట్టి వివరాలులేవు.

రైతులవద్దనున్న స్టాకును కమాండీర్ చేసే పద్ధతికి యీ కమిటీ అంగీకరించకపోవడం దూరదృష్టిని సూచిస్తుంది. ఎందువల్లనంటే, ప్రజాసహకారం లేని కమాండీరింగ్ పద్ధతి రైతులలో ఎంత అసంతృప్తికి కారణమౌతుందో మన రాష్ట్రంలో కొన్నిచోట్ల చూస్తూనే ఉన్నాం. రైతుల నిత్యజీవితావసర వస్తువులు మార్కెట్లో విరివిగా సప్లయిఅయేటట్లు చూస్తే వారివద్దనుండి ఆహారపదార్థాలు సులభంగా విడుదల అవుతాయనీ, లేనిపక్షంలో వెండి, బంగారాల సప్లయిని ఎక్కువచేయడం మంచిదనీ, గ్రిగరీకమిటీ సూచిస్తోంది అయితే, ప్రభుత్వం కార్మికులపట్ల అవలంబించే వైఖరిని మార్చుకొని, వారిలో అధికోత్పత్తికి ఉత్సాహం రేకెత్తించగలిగిననాడే మొదటి సూచనను ఆచరణలో పెట్టవచ్చు. ఇక రెండవసూచన విషయం. వెండి బంగారాలతో రైతుల్ని ఆకర్షించాలను ఆలోచన ఫలించదు ఎందువల్లనంటే-యిందుకవసరమైనంత వెండి బంగారాలు ఎక్కణ్ణించి వస్తాయి? పైగా సూటిగా వెండిబంగారాలతో సరుకు కొనడంవల్ల కర్రెన్సీ విలువ మరింత పడిపోతుంది. ధరలు విపరీతంగా పెరిగి ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతుంది. రైతులు అదనపుధాన్యం యివ్వడానికి వారిలో దేశభక్తిని రేకెత్తించాలి అందుకు జాతీయనాయకులను విడుదలచేసి జాతీయప్రభుత్వం స్థాపించడమేమార్గం.

మొత్తంమీద, గ్రిగరీకమిటీ సిఫార్సులు దేశమంతట ఆహారసమస్యను పరిష్కరించుట కవసరమైన ఒక ప్లానుకు పునాదిగా ఉపయోగపడగలవు. లోపాలను సరిచేసి, వాటిని ఆచరణలో పెట్టాలంటే, వివిధ ప్రజాసంస్థల సహకారాన్ని ప్రభుత్వం తీసుకోవాలి ప్రజలు, సోదర దేశభక్తులు, కూడా యీసమస్యను పరిష్కరించడానికి చొరవతో ముందుకురావాలి.

ఒక విషయాన్ని మనం మరచిపోరాదు. కొన్ని నెలలుగా ఆహారసమస్యను గురించి దేశంలోను, దేశంబయట, తీవ్రమైన ఆందోళన జరుగుతోంది. బెంగాల్ పరిస్థితులే దేశానికంతకూ వ్యాపించకుండా చేయడానికి భారతీయులలో అన్ని వర్గాలవారు, అన్నిపార్టీలవారు, అన్నిమతాలవారు, ప్రభుత్వంమీద ఒత్తిడితీసుకొస్తున్నారు. అటు "టైమ్సు", "మాంచెస్టర్ గార్డియన్", "న్యూస్ క్రానికల్", "డెయిలీ హెరాల్డ్", "ఈవినింగ్ స్టాండర్డ్", మొదలైన బ్రిటిష్ పత్రికలు, "న్యూయార్క్‌పోస్టు", "చికాగో డెయిలీన్యూస్", వంటి అమెరికన్ పత్రికలు, మన దేశంలో వ్యాపించియున్న ఆహారసంక్షోభాన్ని వెంటనే తొలగించకపోతే, బర్మాపై ఎదురుదాడి ఫలించకపోవచ్చునని ఆందోళనచేస్తూవచ్చాయి.

ఆహార సమస్యను పరిష్కరించడానికి దేశంలో వివిధ సంస్థల తరఫున విరాళాలు వసూలుచేసి పంపుతున్నమాటనిజమే. దాతృత్వంఅంటే యేమో తమ జీవితాలలో ఎన్నడూ యెరుగని జమీందార్లు, మార్వాడీలు, మిల్లుయజమానులు, బెంగాల్ కరువునివారణకు ముందుకొస్తున్నారు. నైనీజైలు (యు. పి.)లో ఉన్న 300 మంది కాంగ్రెసుడిటెన్యూలు నెలకు 2 రోజుల చొప్పున ఆహారం మానివేసి బెంగాల్ క్షుధార్తులకు నెలకు రు. 1700 చొప్పున పంపడానికి తమ సంసిద్ధతను తెలియజేశారంటే, బయటి కాంగ్రెసు దేశభక్తులపై ఎంత పెద్ద భారం ఉన్నదో ఊహించు కోవచ్చు.

అయితే, దాతృత్వం ఒక్కటే దేశాన్ని రక్షించలేదు. కాంగ్రెసు సోదరులు, ముస్లింలీగ్ దేశభక్తులు, హిందూ మహాసభవారు, కమ్యూనిస్టులు - అంతాకలిసి పూనుకుంటేనే ఆహార సమస్యను జయప్రదంగా పరిష్కరించు కోగల్గుతాం. అప్పుడే నిరంకుశాధికారవర్గంపై బలమైన ఒత్తిడి తీసుకురాగల్గుతాం. దేశం జపాన్ ముష్కరుల చేతులలో పడకుండా కాపాడుటకు మార్గంయిదే. ఈ రోజున చొరవ అంతా నిరంకుశాధికార వర్గపు చేతుల్లోఉంది. దాన్ని మనం లాక్కోవాలి. జాతీయైక్యత ఒక్కటే అందుకుమార్గం.

మనరాజకీయాలు

తానుపట్టిన కుందేటికి మూడేకాళ్లు - ప్రపంచ ప్రజాభిప్రాయం - పార్టీ కక్షల రచ్చ - దేశభక్తుల కర్తవ్యం

1939 లో చైనా ప్రజాయుద్ధానికి సాయం చేస్తే, ఆసియాలో తమ వలసరాజ్యాలకు ముప్పువస్తుందని అభ్యంతరాలుపెట్టిన అమెరీ, భారత రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించడానికి నేడు చేయవలసిందేమీలేదంటున్నాడు. పార్లమెంటులో అడిగిన ప్రశ్నలకు సమాధానంగా అమెరీ బెంగాల్ ఆహార సమస్య రాష్ట్రప్రభుత్వానికి సంబంధించిందనీ, రాష్ట్ర స్వపరిపాలన వుండుటచే బాధ్యత వారిదేననీ, సాచివేతకబుర్లు చెబుతున్నాడు. కరువును పరిష్కరించడానికి, ఆకలిమంటలను చల్లార్చడానికి ప్రజల సహకారానికి అవసరమైన జాతీయనాయకులను విడుదలచేస్తారా? అనే ప్రశ్నకు అమెరీ సమాధానమే యివ్వలేదు. విషమించుతున్న పరిస్థితులను గమనించకపోవడం, తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళనడం అమెరీ మొండితనానికి ప్రత్యేక లక్షణం.

ప్రపంచ ప్రజాభిప్రాయం

ఈవిధ గా మ్యూనిక్ద్రోహులముఠా కదలడానికిఇష్టపడకపోయినా, సత్వర మిత్రరాజ్య విజయాన్ని కోరేవారంతా భారతసంక్షోభాన్ని పరిష్కరించాలని కోరుతున్నారు. భారతసమస్యనుపరిష్కరించాలని బ్రిటిష్‌కమ్యూనిస్టుపార్టీ, బ్రిటిష్ కార్మికులు ప్రారంభించిన ఆందోళన క్రమంగా జయంపొందుతూంది. కన్సర్వేటివ్ పత్రిక అయిన లండన్‌టైమ్సు సహితం "ఆసియాలో యుద్ధనిర్వాహణానికి అంతకూ కేంద్రంగా వుండవలసిన బెంగాల్ రాష్ట్రంలో పరిస్థితులు యిలా విషమించడం బ్రిటిష్, ఇండియన్ పాలకులకు కూడా సిగ్గుచేటని వ్రాసింది. ఇల్లాగే లిబరల్, లేబర్ పత్రికలు కూడ భారత దేశంలో విషమించుతున్న ఆర్థిక సంక్షోభాన్ని తొలగించడానికి వెంటనే పూనుకోవాలని వ్రాశాయి. అమెరీ సమాధానాలు అసంతృప్తికరంగా వున్నాయని వ్రాస్తూ మాంచెస్టర్ గార్డియన్ పత్రిక యిలా వ్రాసింది: "బ్రిటిష్ ప్రభుత్వానికి భారత ప్రజాభిప్రాయానికి మధ్యవున్న అఖాతం పరిస్థితులను మరింత విషమింపజేస్తూంది." లేబర్‌పార్టీపక్ష డెయిలీ హెరాల్డ్, మంత్రి తన కేమీబాధ్యత లేదనడాన్ని నిరసించుతూ, ఇండియాలో సంక్షోభానికి బాధ్యత బ్రిటనుదేననీ, పరిష్కారానికి పూనుకోవాలనీ, వ్రాసింది. పార్లమెంటు సభ్యుడు విలియంకోవ్ అధ్యక్షతను యేర్పడిన సంఘం వారు అమెరికాలో ప్రచారం చేయడానికి ఒకరాయబారవర్గాన్నిపంపాలని ప్రయత్నించుతున్నారు. ఇందుకు తమ హృదయపూర్వక సహకారాన్ని తెలుపుతూ సుప్రసిద్ధులైన పెరల్ బక్ సతి, చైనా రాయబారి డాక్టర్. లిన్‌యూటాంగ్, వింధల్‌వెల్కి సందేశాలు పంపారు.

కొత్త వైస్రాయి వేవెల్

నానాట తీవ్రమవుతున్న భారతసంక్షోభం, పరిష్కారం కోరుతున్న ప్రపంచాభిప్రాయం, కొత్తగా వైస్రాయిగా రానున్న వేవెల్‌ప్రభువును పరిస్థితుల తీవ్రతను గుర్తించునట్లు చేసింది. తనను సాగనంపడానికి యివ్వబడుతున్న ప్రతి స్వాగతసభలోనూ వేవెల్ భారత దేశం యిపుడు మోయుచున్న ఆర్థిక బరువును గురించియు, దానిని తొలగించడానికి ప్రయత్నించకపోయినచో ఆర్థిక వ్యవస్థ కూలిపోయే ప్రమాదం వుందనీ స్పష్టపరుస్తున్నాడు. ప్రతి ఉపన్యాసంలోను మధ్యప్రాచ్యంలో ఫాసిస్టులదాడినుండి యీజిప్టును రక్షించడంలో నాల్గవ భారతసైన్యంయొక్క ప్రాధాన్యతను గురించి నొక్కి చెబుతున్నాడు. అంటే వాస్తవిక పరిస్థితులను గుర్తించవలసి వచ్చిందన్నమాట. ఈస్టుఇండియా అసోషియేషన్ యిచ్చిన విందులో వేవెల్ ప్రభువు దిగ్గజము వంటివాడనీ, ఆతడు దాటనున్న వంతెనను పరీక్షచేసి దాటవలసివుంటుందనీ అమెరీ ఉపదేశించాడు. సమాధానంగా వేవెల్, "యీదిగ్గజం అంలు వంతెననే కనుగొనవలసివుంది" అన్నాడు. విన్‌చెస్టర్ సభలో మాట్లాడుతూ, "మనం భారతదేశంలో ఒకటిరెండుసార్లు పొరబాట్లు చేశాము. అవి అపార్థంచేసికోవడంవల్ల వచ్చిన తప్పులేగాని, అత్యాశ, భయంవల్ల చేసిన తప్పులుకావు." అని చెప్పుకొన్నాడు. లండను ఎంపైర్ సొసైటీ సభలో మాట్లాడుతూ భారత దేశ ఆర్థిక వ్యవస్థపై బడి నబరువును యింకా పెరగనిచ్చిన వచ్చే ప్రమాదాన్ని గురించి హెచ్చరించాడు. నాల్గవ భారతసైన్యం ఒకటే యీజిప్టు యుద్ధారంభంలో తన క్రిందవున్న సుశిక్షణపొందిన సైన్యమని పొగిడాడు.

ఇవన్నీ ఒకేవిషయాన్ని ద్యోతకపరుస్తున్నాయి. బ్రిటిష్ ప్రజల ఒత్తిడి, ప్రపంచ ప్రజాభిప్రాయం, భారతదేశంలో నానాట విషమించుతున్న రాజకీయ,ఆర్థిక,సంక్షోభం కొత్త వైస్రాయిని ప్రమాదకరపరిస్థితులను గుర్తించునట్లు చేస్తున్నాయి.

ఇటు భారతదేశంలో!

సింధు ముస్లింలీగ్ కమిటీ సభ్యుడు షేక్ అబ్దుల్ మజీద్ ఎం. యల్. ఏ. రాజకీయ ఖైదీలను, విద్యార్థి,కార్మిక,నాయకులను విడుదల చేయవలసిందని ప్రకటన చేశాడు. బెంగాల్ అసెంబ్లీలో రాజకీయఖైదీల విడుదలకు మంత్రివర్గం యింతవరకు చేసిన కృషిని హర్షించుతూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను గుర్తించి, రాజకీయఖైదీల విడుదల యింకా త్వరగా జరుగునట్లు చూడాలని సూచించుతూ తీర్మానించబడింది.

మద్దుకూరి చంద్రశేఖరరావు

సరిహద్దు రాష్ట్రంలో లీగ్‌మంత్రివర్గం 60 మందిని మినహా తక్కిన వెయ్యిమందికిపైగా రాజకీయ ఖైదీలను విడుదలచేయ పూనుకొంది. అప్పుడే అధికసంఖ్యాకులను విడిచిపెట్టింది. అంటే, లీగ్ కేంద్ర నాయకత్వం ముందంజవేసి కాంగ్రెసు నాయకుల విడుదలను యింకా డిమాండు చేయకపోయినా, స్థానికంగా లీగ్‌నాయకత్వం రాజకీయ ఖైదీల విడుదల అవసరాన్ని గుర్తించుతూంది. కాని, లీగ్ మంత్రివర్గాలు యింకా చొరవతీసుకోవాలి. అబ్దుల్‌గఫూర్‌ఖాన్‌వంటి ప్రజానాయకుని విడుదలకు — అధికారవర్గం ఆటంకాలను లెక్కచేయకుండా—ప్రయత్నించాలి.

బెంగాల్ కరువు దేశాన్నంతటిని కదల్చివేసింది. అన్నిమూలలనుంచి ప్రజాసంస్థలు కరువు నివారణ నిధులను పంపడానికి కృషి చేస్తున్నాయి. బెంగాల్ ప్రజలలో అధికసంఖ్యాకులు ముస్లిమ్‌లు. దేశంలో అన్నివైపులనుంచి అన్నిమతాలకు చెందిన ప్రజలు నిధులకు సహాయం చేస్తున్నారు.

పార్టీ కక్షల రచ్చ

కరువు బాధితులకు సహాయంచేయడానికి కాంగ్రెసువాదులు, కమ్యూనిస్టుపార్టీ, ముస్లింలీగ్, అఖిలభారత కిసాన్‌సభ, ట్రేడ్‌యూనియన్‌కాంగ్రెస్, ఆత్మరక్షసమితి, వగయిరా వివిధ ప్రజాసంస్థలతో కూడిన అఖిలపక్ష కమిటీ యేర్పడి పనిచేస్తూంది. దీనికి ప్రతిద్వందిగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ హిందూ ప్రముఖులతోమాత్రమే కూడిన ఇంకోసంఘం నిర్మించాడు. లీగ్ అధ్యక్షుడు జిన్నా, లీగ్ పోగుచేసిన నిధిని ముస్లిమ్‌చేంబర్‌ఆఫ్ కామర్సుకు పంపాలని ప్రకటన చేశాడు. కరువు పీడితులయిన ప్రజలకు సహాయంచేయడంలో కూడ పార్టీనాయకు లీవిధంగా చీలికలు తెస్తున్నారు. ఎంతో (మిగతా 7 వ పేజీలో)

కార్మికలోకం

మ్యునిసిపల్ కార్మికుల విషయంలో అధికారులు కొన్ని ప్రాంతాలలో తమ బాధ్యతను గుర్తించకుండా, నిరంకుశంగా ప్రవర్తించడం జరుగుతూంది. ఈ ప్రవర్తనలు ప్రజల ఆరోగ్యానికి, తద్వారా దేశానికి, ఎంతదెబ్బ తీస్తున్నాయో వీరు గుర్తించడంలేదు.

నెల్లూరులో ఒక మునిసిపల్ కార్మిక స్త్రీని ఒక మేస్త్రీ బలాత్కరించడానికి ప్రయత్నించాడు. ఇది కార్మికుల్లో చాల ఆవేశం కలిగించింది. వారీ అమానుష చర్యను ఖండించారు. అందుకా మేస్త్రి కార్మికుల మీద, ముఖ్యంగా ఇద్దరిమీద కసిబూనాడు.

14 వ తేదీ ఉదయం వాళ్ళిద్దరూ మస్తరుకి 5 నిమిషాలు ఆలస్యంగావచ్చారనే మిష మీద, ఇన్‌స్పెక్టరుచేత వారిని పనిలోకి తీసుకోకుండా చేశాడు. మరునాడు మామూలు ప్రకారం వాళ్ళిద్దరూ రెండో డివిజనులో పనికి వెళ్ళితే, అక్కడి మేస్త్రీలుకూడా వారిని పనిలోకి రానీయలేదు. దీనిసిబట్టి చూస్తే మొదటి మేస్త్రీని మందలించడానికి బదులు, తక్కిన ఉద్యోగులు అతనిని సమర్థించడం ప్రారంభించారని స్పష్టమౌతూంది.

ఆ డివిజన్‌లోని తక్కిన కార్మికులందరూ వీరిద్దరినీ పనిలోకి తీసుకోవలసిందని కోరారు. ఆ కోర్కెను నిరాకరించడమే కాకుండా, తక్కిన పనివారిని కూడా పనిలోకి రావద్దు పొమ్మన్నారు. మునిసిపల్ కమీషనరును, హెల్తాఫీసరును, అక్కడికి తీసుకొచ్చి, వీళ్ళ అక్రమ ప్రవర్తనను అరికట్టడానికి మునిసిపల్ కార్మిక సంఘ కార్యదర్శి ఎంతో ప్రయత్నించాడు. కాని వాళ్ళిద్దరూ నిర్లక్ష్యంగా ఊరుకున్నారు.

తక్కిన డివిజన్ల కార్మికుల్లోకూడా ఆందోళన ప్రారంభమయింది. ఈ అక్రమాన్ని సరిదిద్దేవరకు పనిలోకి వెళ్ళకూడదనే భావం బలపడసాగింది. ఈవిషయం గురించి కలెక్టరు దగ్గరకు డెప్యుటేషన్ వెళ్లాలని తమ కార్యదర్శిని కోరారు, ఈ అలజడి అంతటికీ కార్యదర్శే కారణమన్నట్లు కలెక్టరు అతనిని దూషించడం ప్రారంభించాడు; అరెస్టు చేయిస్తానని బెదరించాడు. మొదటి యిద్దరు కార్మికుల్నీ తిరిగి పనిలోకి తీసుకోవలసిందనీ, ఆమేస్త్రీపై తగు చర్యతీసుకోవాలని, కోరుతూ కార్మికులిచ్చిన మహజరునుగురించి విచారిస్తానని వాగ్దానంచేశాడు. దానిమీద కార్మికులుతిరిగి పనిలోకి వెళ్లారు కాని,కిందనుంచి పైవరకూ, అధికారులందరూ తమకే అనుకూలంగా ప్రవర్తించడంవల్ల, ఛోటాఉద్యోగులకు పట్టపగ్గాలు లేకుండా వున్నాయి. కార్మికులు రెచ్చిపోకుండా తమ విధులను నెరవేరుస్తూ, తమ సంఘాన్ని నూటికినూరి తలు బలపరచుకొని ప్రజల సానుభూతిబలంతో తమ యిబ్బందులను తీర్చుకోడానికి నిశ్చయించుకున్నారు. ఈమార్గం వారికి తప్పకవిజయంకలిగిస్తుంది.

విజయనగరంలో

విజయనగరంలో మునిసిపల్ అధికారులు పనివారికి కరువు భత్యాలు సక్రమంగా ఇవ్వడంలేదు. అంతేకాకుండా, మునిసిపల్ పనివాళ్ళ సంఘ ఆందోళన ఫలితంగా తెరచిన బియ్యపుడిపోలో సరిగా బియ్యంసప్లయి చేయడంలేదు. కరువు భత్యాలు సక్రమంగా ఇవ్వాలని, పనివారికి రేషన్ ప్రకారం అందవలసిన ఆహారపదార్థాలను పూర్తిగా అందజేయాలని, కోరుతూ 15-9-43 న యూనియన్ తీర్మానించింది. తీర్మానంతో ఆగకుండా పనివారు తమ కనీసపు కోర్కెలను తెలుపుతూ,వాటికై ప్రజల సహకార బలాన్ని సమకూర్చుకున్నారు, ఈ కోర్కెల మహజరు మీద ఆర్యవైశ్య సంఘం, ఆంధ్రయూనివర్సిటీ విద్యార్థి సంఘం, ఆంధ్రమహాసభ, ల్యాండు మార్టుగేజ్ బ్యాంకుల కార్యదర్శులున్ను,స్థానిక వార్ కమిటీ ప్రముఖులొకరున్ను, సాకేటి గురువులుగారు(యం.యల్.సి) సంతకాలు చేశారు, ఇంతేకాకుండా నాలుగు వందల కుటుంబాల తరఫున కూడా సంతకాలు తీసుకున్నారు.

క్వారీ కూలీల కష్టాలు

రాజమండ్రి రాళ్ళ క్వారీలో సుమారు 600 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఆ రాళ్లు మిలటరీ రోడ్లు వగైరా కంట్రాక్టు పనులకు యీ రాళ్లు వినియోగపడుతున్నాయి. యజమానులు గతానికి కూలీ 1-0-0 నుంచి 1-4-0 పెంచారు. కాని, కొన్నాళ్ళు గడిచాక తిరిగి దీనిని 1-0-0 కి తగ్గించి, అంతకన్నా ఎక్కువ ఇవ్వమని, ఇష్టంలేనివారిని పొమ్మని, దొంగ కూలీలచే పనిచేయించుకోడానికి తయారవుతున్నారు. మిలిటరీ అవసరాలకు సంబంధించే ఇలాంటి దేశరక్షణ పనుల్లో కార్మికుల అసంతృప్తిని తగ్గించుటకు బదులు ఏక్కువ చేయడం యజమానుల కేమాత్రం తగదు. యజమానులు ఈ ఆటలను చాలించి, కార్మికులకు ప్రస్తుత పరిస్థితులకు తగిన ఎక్కువ కూలీ నిర్ణయించి, సక్రమంగా పనిజరిగేలాచూడాలి.

చేనేత పారిశ్రామికుల విజయం

కడపజిల్లాలో ముఖ్య చేనేత పారిశ్రామిక కేంద్రం పుల్లంపేట. 600 పైగా మగ్గాలున్నాయక్కడ. కాని, షాహుకార్లు యుద్ధానికి పూర్వంయిచ్చే కూలీయే యిస్తున్నారు. ప్రస్తుతపరిస్థితులకు తగిన రేటు యిప్పించాలని అప్పుడే కొత్తగా యేర్పడిన తమ సంఘం ద్వారాను, అనేకమంది పురప్రముఖులద్వారాను, 10 వ తేదీనుండి రాయబారాలు జరిపారు. అయినా షాహుకార్లు తమ మొండి పట్టు వదలలేదు. చివరకు 17 వతేదీని కార్మికులు సమ్మెచేశారు. బట్టల కరువు తీవ్రంగా వున్న యీరోజుల్లో యీసమ్మెవల్ల కలిగే నష్టాన్నిగుర్తించి స్థానికతహసీల్దారు ఆమరునాడేవచ్చి ఈతగాదాను పరిష్కారం చేశాడు. మునుపటి రేటుకన్నా 2-0-0 ఎక్కువఇప్పించాలని కార్మికులు మొదట కోరారు. కాని, పరిష్కారంలో 1-12-0 హెచ్చుదలకు అంగీకరించారు. పట్టణంలో వున్న కార్మికులకు, పల్లెలో వున్న కార్మికులకు భేదం చూపించకూడదన్న కోరికకుకూడ షాహుకార్లు అంగీకరించారు. ఈవిజయం ఫలితంగా కార్మికుల్లో సంఘం అంటే యెంతోవుత్సాహం పెరిగింది. సంఘాన్ని అభివృద్ధి చేసుకోడానికి కృషి చేస్తున్నారు.

ఈ విజయం సాధించడానికి సంఘం జరిపిన ఆందోళన, ప్రచారం, చాలవరకు కారణమని చెప్పాలి. కాని ఈఆందోళన ఫలితంగా తగినంత ఎక్కువగా ప్రజా సానుభూతి, సహకారాలు సంపాదించ గలిగినట్టయితే, సమ్మె అవసరమే లేకపోయేది. అన్ని విధాల అధికోత్పత్తి జరపడమే దేశభక్తియుత కర్తవ్యమయిన ఈ రోజుల్లో, సంఘ శక్తితోను, ప్రజల సానుభూతి సహకారాలతోనే తమ కోర్కెలను నెరవేర్చుకోడానికి కార్మికులు కృషిచేయాలి.

ఇవీ - అవీ

ఫాసిస్టు ప్రమాదాన్నుండి దేశాన్ని రక్షించడంలో మన దేశంలోని సైనికులు నిర్వహించే పాత్రను మనరాష్ట్రంలో ప్రజలు గుర్తిస్తున్నారు,

కృష్ణాజిల్లా పెదపాలపర్రు గ్రామంలో సెలవుమీద యింటికొచ్చిన ఒక సైనికునికి 16 వ తేదీని ప్రజలు సన్మానం చేశారు. 75 మంది రైతులు, 20 మంది బాలబాలికలు యీసన్మానంలో పాల్గొన్నారు. ఇలాంటి సైనికులందరూ దేశరక్షణను జయప్రదంగా నిర్వహించాలంటే, వారికి కావలసిన ఆహారం మొదలైనవాటిని ప్రజలు అధికంగా ఉత్పత్తి చేయాలని ప్రముఖులు ఉపన్యాసాలిచ్చారు.

ఈగ్రామంలోనే అంతకుపూర్వం మరొక సైనికునికి సన్మానం చేశారు.

ఈనెల మొదటితేదీని నెల్లూరుతాలూకా, పిడూరుగ్రామంలో, సెలవుమీద ఇంటికివచ్చిన వెంకయ్య అనేసైనికునికి గ్రామస్థులు అల్పాహారవిందు చేసి సన్మానించారు. ఈవిధంగా ప్రజలు తమకు దూరంగా లేరనీ, తమకు అండగా నిలచి వున్నారని గుర్తించిన యీ సైనికులు దేశరక్షణను రెట్టింపుఉత్సాహంతో నిర్వహించగలరు.

విడుదల చేయాలి

కామ్రేడ్ నెక్కంటి నరసింహారావు ఆలిపూర్ జైలులో తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ, ఇప్పటికి (17-9-43) 12 రోజుల నుంచి లంకణాలుంటున్నాడు. ఇంకా జైలులో ఉంటే ఇతని స్థితి చాల ప్రమాదకర మవుతుంది. కాబట్టి వెంటనే ఇతన్ని పెరోల్ మీద విడిచిపెట్టాలని 17 వ తేదీని జరిగిన నర్సాపురం తాలూకా కమ్యూనిస్టుపార్టీ జనరల్‌బాడీసమావేశం తీర్మానించింది.

తెనాలి యువజనసంఘం 20 వ తేదీన జరిగిన సమావేశంలోకూడా ఈ కామ్రేడ్ విడుదలను కోరుతూ తీర్మానించింది.

శిక్షలు

కామ్రేడ్స్ పరకాల రమణారావు, వంకా సత్యనారాయణ, శ్రీరామారావు, శేషావతారం, సోమరాజు, సుబ్బరాజు, సంజీవరావు గారలు యండగండి (భీమవరం తాలూకా)లో గాంధీజీని విడుదల చేయవలసిందని, ఆహారసమస్య పరిష్కారమునకై ఆహార కమిటీలను ఏర్పరచవలసిందని, ప్రచారం చేశారు. "తిండికోసం" అనే నాటకము ప్రదర్శించారు. విద్యార్థి సంఘ యాజమాన్యాన, కమ్యూనిస్టు బురఖాతో, కాంగ్రెసు ప్రచారంచేస్తున్నారని, 56 రూలు అతిక్రమించారని, నేరం ఆరోపించబడి, విచారణజరిగినమీదట 18-9-43 న వీరందరికి 6 నెలలు చొప్పున కఠినశిక్ష విధించారు. వీరిలో కామ్రేడ్ సోమరాజు మిగిలిన వారికి ఆతిథ్య మిచ్చిన నేరం క్రింద అదే శిక్షవిధించబడ్డాడు.

ఆంధ్రమహాసభ ప్రజాసేవ

షర్కి (నైజాం) తాలూకా బొల్లెపల్లి గ్రామంలో, సుమారు కొద్దిరోజుల కిందట కలరావచ్చింది. ముగ్గురు చనిపోయారు. గ్రామోద్యోగులు పై అధికారులకు రిపోర్టు పంపినా, వారేమీ శ్రద్ధతీసుకోలేదు. వెంటనే స్థానిక ఆంధ్రమహాసభ కార్యభారంవహించి, కలరా నివారణకు చందాలు ప్రోగుచేసి, హైద్రాబాదు నుంచి డాక్టర్లను పిలిపించింది. 750 మందికి టీకాలు వేయించారు. కలరా బాధితుల ఇళ్ళల్లోకివెళ్ళి, వాళ్ళకు మందులివ్వడం, ఇళ్ళను శుభ్రంచేయడం, బావులలోని నీళ్ళను పరిశుభ్రంచేయడం, అంతా ఆంధ్రమహాసభవారు నిర్వహించి, ఆదర్శ ప్రజాసేవకు లనిపించుకున్నారు.

గంజి పారబోయవద్దు

తూర్పుగోదావరిజిల్లా గొల్లప్రోలు యువకులు యింటింటికి వెళ్ళి, గంజి పారబోయవద్దనీ, తిండిలేక మాడుతున్నవారి కాగంజి యివ్వవలసిందనీ అందరికీ నచ్చచెప్పారు. దేశంలోని కరువుపరిస్థితులను వివరించారు. ఈవిధంగా సుమారు 30 మంది బీదలకు ప్రతిరోజూ గంజిమెతుకులు దొరుకుతున్నాయి.

మృత్యువునుంచి కాపాడారు

చీపురుపల్లితాలూకా (విశాఖజిల్లా)గులివిందాడ అగ్రహారం యువకులు ఒకయువకుణ్ణి మృత్యుముఖంనుంచి కాపాడారు. టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తున్నందుకు 18 వ తేదీని మధుసూదన్‌హోజార్ అనే యువకుణ్ణి చీపురుపల్లి స్టేషన్‌లో అధికారులు దించేశారు. ఒరిస్సాలోని సూన్‌గుడానుంచి బయలుదేరాడాయువకుడు. వయస్సు 15 సంవత్సరాలు. అంతకుముందే కొన్నిరోజులనుంచి తిండిలేక వట్టినీళ్ళతో ప్రాణాలు నిలబెట్టుకుంటూ వచ్చాడతను. చీపురుపల్లిలో దిగగానే వాంతులు ప్రారంభమయాయి. అగ్రహారం వీధిబడిలో స్పృహతప్పి పడిపోయాడు. ఒక రోజంతా అలాగే బాధపడ్డాడు. మరునాడిదితెలిసికొని స్థానిక యువజనసంఘ వారతన్ని హాస్పిటలులో చేర్చారు. మూడేసిగంటలకొకరుచొప్పున వంతులు వేసుకొని, యువకు లతనికి ఉపచారం చేశారు. రెండురోజులు 'ఏమో' అన్నస్థితిలో గడచినతర్వాత మూడవరోజున కతను తేరుకొన్నాడు.

వివిధప్రాంతాల్లో ఆహారసభలు

ఏలూరు తాలూకా యందలి ప్రజాసేవకులు, తాలూకా మొత్తంమీద కరువు పరిస్థితుల నెదుర్కొడానికి జరిపిన కృషి ఫలితంగా, మొన్న 20 వ తేదీని ఏలూరులో వీరమాచనేని వెంకటనారాయణగారి అధ్యక్షత కింద తాలూకా ఆహార మహాసభ జరిగింది. 15 గ్రామాలనుండి వచ్చిన వందమంది ప్రతినిధులు సభలో పాల్గొన్నారు. దేశంలోని, తాలూకాలోని, ఆహార సమస్యను గురించి ప్రముఖులు ఉపన్యసించారు. శ్రీమతి ముల్పూరి చుక్కమ్మగారు బెంగాలు పరిస్థితులను వివరించి, బెంగాలు సహాయనిధికి విజ్ఞప్తిచేశారు.

జీవితావసర వస్తువులకు, వ్యవసాయ పరికరాలకు కనీస గరిష్ట ధరలను నిర్ణయించాలనీ, గ్రామాలలో పెద్ద రైతులు, షాహుకార్లు ఆహార పదార్థాలను ఆహార కమిటీల ద్వారానే స్టాకుచెయ్యాలనీ, గ్రామాల అవసరాలు తీరిపోగా మిగిలే ధాన్యాన్ని కరువు ప్రాంతాలకు అమ్మవలసిందని వీరికి నచ్చజెప్పాలనీ తీర్మానాలు జరిగాయి. రాయలసీమకు సహాయం చేయాలని తీర్మానించారు.

వడ్లపల్లి మల్లిఖార్జునరావుగారు బి. ఏ., బి. యల్., అధ్యక్షులుగాను, కొమ్మారెడ్డి పట్టాభిరామయ్యగారు కాదర్శిగాను, మరి 15 గురు సభ్యులతో తాలూకా ఆహార కమిటీ ఎన్నుకోబడింది.

పర్చూరులో

గుంటూరుజిల్లా పర్చూరుగ్రామంలో 20 వ తేదీని ఆహార సభ జరిగింది. సభలో 350 మంది పాల్గొన్నారు. 11 మంది సభ్యులతో ఆహారకమిటీ ఎన్నుకోబడింది. వీరిలో ఇద్దరు ముస్లింలు.

రాజంపేటలో

కడపజిల్లా రాజంపేటలో 19 వ తేదీని ఆహార సభ జరిగింది. సభకు వంకదారి సత్యనారాయణగారు (కాంగ్రెసు) అధ్యక్షత వహించారు. సభలో 150 మంది పాల్గొన్నారు. బెంగాల్ కరువునిధిని పోగుచేయడానికి ఈ సభలో తీర్మానం జరిగింది. రాజంపేటకువచ్చే బియ్యం సప్లయిని రెట్టింపు చేయవలసిందని కలక్టరును కోరుతూ ఒక తీర్మానంచేశారు. రేషనింగు అమలుజరపడంకోసం కృషిచేయ నిశ్చయించారు.

ఇటలీ పరిస్థితులెవరికి లాభదాయకం?

ముసోలినీ నేలకూలాడు - మార్షల్ బదోగ్లియో అధికారంలోకి వచ్చాడు. అటు హిట్లరు - ఇటు మిత్రమండలి - ఈ రెండు పక్షాలమధ్య ఊగిసలాడి, బదోగ్లియో చివరకు మిత్రపక్షాలకి లొంగిపోయాడు. దీనితో ఇటలీలో సరికొత్త పరిస్థితులేర్పడ్డాయి. ఈ పరిస్థితులేవో, అవి ఎవరికి లాభదాయకమో, చూద్దాం.

అసలు ముసోలినీని పడగొట్టిన శక్తులేవి? సామ్రాజ్య తృష్ణతో ముసోలినీ హిట్లరు పక్షం చేరాడు. అక్కడ నుంచి క్రమక్రమంగా ఇటలీ హిట్లరు అధికారం కిందికి పోయింది. అంతేకాకుండా, ఈ ఇద్దరి ఎత్తుగడలకు ఇటలీ సేనలోని అధికభాగం ఆహుతయింది. రెండు లక్షలకుపైగా ఇటలీ సైనికుల్ని రెడార్మీ హతమార్చింది. ఉత్తరాఫ్రికాలో మిత్రసేనలు అనేక ఇటలీ సైన్యాలకు లెక్కచెప్పాయి. యుద్ధరంగంలో పరాజయాలిలా పెచ్చుపెరిగిపోతూంటే, ఇటలీలో దేశీయ పరిస్థితులెలా ఉన్నాయి? ఒకదాని తరువాత ఒకటిగ సాగుతూన్న యుద్ధాలపై ఇటలీప్రజల విరక్తిపైకి పొంగింది. తమనీయుద్ధాలలోంచి ఈడుస్తూ దుర్భిక్ష పాల్జేస్తున్న ముసోలినీమీద, అతని ఫాసిస్టు పార్టీ మీద, అసంతృప్తి అంతులేని ద్వేషంగా ముదిరింది. పైగా దేశంలో జర్మను పోలీసుల పెత్తనం. "ఈ యుద్ధాలిక చాలు. మాకు శాంతి కలిగించండి" అని కోరుతూ రైతులు, కార్మికులు, ప్రజలు బాహాటంగా ప్రదర్శనాలు ప్రారంభించారు. దినదినాభివృద్ధి పొందుతూన్న ఈ ప్రదర్శనాల ముందు ముసోలినీ ఫాసిస్టు రాజ్యాంగం పునాదులతో ఊగులాడడం ప్రారంభించింది. దాన్ని నిలబెట్టుకోవడం ఎలాగ? హిట్లరు దగరకు పరుగెత్తాడు ముసోలినీ. అతడు మాత్రం ఏం చేయగలడు? ప్రపంచ ప్రజల శాంతి, సౌఖ్యాలను సమాధి చేయడానికి తాను తవ్విన గోతిలోకి తానే మెల్లమెల్లగా దిగజారుతూన్నాడు హిట్లరు. తాను జరిపిన ఘాతుక చర్యలకు ప్రపంచ ప్రజల తరఫున తిరుగులేనిశాస్తి జరపడానికి రెడార్మీ వెన్నంటి తరుముకొని వస్తూంది. కాస్త పట్టు సడలిస్తే తన అంతు చూడ్డానికి ఆక్రమిత దేశాలలో ప్రజలు సిద్ధంగా ఉన్నారు. 'బతికి బయటపడడ మెలాగురా భగవంతుడా' అని ఆక్రోశిస్తున్న హిట్లరు ముసోలినీకి చేయగల సాయమేది? ముసోలినీకి మొండిచేయి ఎదురయింది.

ప్రజావిజయం

అక్కడ లాభంలేదనుకొని ముసోలినీ తిరిగి వచ్చాడు. ఇటలీలోనే రాజ్యాంగ యంత్రంమీద, సైన్యంమీద తన పట్టు బిగిస్తే లాభం ఉంటుందనుకున్నాడు. ఈ అధికారాన్ని అడగడానికి ఇటలీ రాజు దగ్గరకు వెళ్ళాడు. రాజు దేశంలోని పరిస్థితులను గ్రహించాడు. అంతే కాకుండా ఇటలీ సైన్యానికికూడా ఫాసిస్టుపార్టీపై ద్వేషం పెరిగింది ఇక ముసోలినీని అంటిపెట్టుకొని ఉంటే తానుకూడా ప్రజల ద్వేషానికి గురికాక తప్పదని రాజు తెలుసుకున్నాడు ముసోలినీని అరెస్టు చేయించాడు. బదోగ్లియోకు అధికారం ఇచ్చాడు.

20 ఏళ్ళపాటు ఇటలీ ప్రజల్ని కుంగదీస్తూవచ్చిన ఫాసిస్టు గుదిబండయిలా తెగి నేలకూలింది. ప్రజల ఫాసిస్టు ప్రతికూలత కట్టలు తెంచుకొంది. కనబడ్డ ఫాసిస్టుల కందరికీ శాస్తి చేశారు. ఈ విధంగా ఇటలీ ప్రజలు ఫాసిస్టు రాజ్యాంగాన్ని కూలదోయడంలో ప్రధాన పాత్ర వహించారు.

బదోగ్లియో ఫాసిస్టే. అబిసీనియాను లోగడ నానాహింసలుపెట్టిన దుష్టగ్రహాల్లో ఇతను ముఖ్యుడు. కాని, తనచుట్టూ మిన్ను ముట్టుతూన్న ఫాసిస్టు ప్రతికూల ద్వేషాగ్నిని చూచి బెంబేలెత్తిపోయాడు. ఫాసిస్టుపార్టీని నిషేధించాడు. ఫాసిస్టు చిహ్నాలను పీకిపారవేయించాడు. ప్రత్యేక ఫాసిస్టు సైనికదళాలను రద్దుచేశాడు. ఫాసిస్టు అధికారులను అరెస్టు చేసి, వాళ్ళు పోగుచేసిన ఆస్తుల్ని ప్రభుత్వ వశంచేశాడు.

క్రమంగా ప్రజాశక్తులు సంఘటితమై అభివృద్ధి పొందుతూ రాసాగాయి. కమ్యూనిస్టులు, సోషలిస్టులు, కాథలిక్కులు మొదలైన ప్రజా పార్టీలు సంయుక్త కమిటీల నేర్పరచి పొంగు కొస్తున్న ప్రజలను నడపడం ప్రారంభించాయి. బదోగ్లియో దీనిని అణచడానికి ప్రయత్నించాడు. అందుకు సేనల్ని పంపించాడు. కాని ఆసేనలు ప్రజలను కాల్చడానికి నిరాకరించాయి.

పరిస్థితుల్లోమార్పు

అదే సమయంలో మిత్రసేనలు సిసిలీని చుట్టపెట్టుకుంటూ వస్తున్నాయి. వాటి రాక ఇటలీ ప్రజల ఉత్సాహాన్ని ఎన్నోరెట్లు హెచ్చించింది. మిత్రమండలితో సంధిచేసుకొని జర్మన్లను తరిమికొట్టాలనే నినాదం మరింత బలపడింది. ఈ పని చేయలేకపోతే బదోగ్లియో కూడా తొలగిపోవాలనే నినాదంకూడా బయలుదేరింది.

ఇక బదోగ్లియోకి రెండే మార్గాలు కనబడ్డాయి. ప్రజావెల్లువనుఅణచి, మిత్రమండలిపై యుద్ధం సాగించడానికి హిట్లరుతో బేరం పెట్టుకోవడమా? లేక, ప్రజల కింత ఉత్సాహాన్నిస్తున్న మిత్రమండలితో సంధి కుదుర్చుకోవడమా?

అటు రెడార్మీ హిట్లరు సేనల్ని తుడిచి పెట్టుకుంటూ ముందుకొస్తూంది. అపరిస్థితుల్లో హిట్లరుతో బేరాలు ఎందుకు పనికొస్తాయి? ఊగులాడి, ఊగులాడి- చివరకు బదోగ్లియో మిత్రమండలితో సంధి కుదుర్చుకున్నాడు. మిత్రమండలి సేనలు ఇటలీలో దిగాయి. ఫాసిస్టు ప్రతికూలురైన ఇటలీప్రజలకొక పెద్ద అండ దొరికింది.

ఇది జరిగిన నాటినుండి ఇటలీలోని పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఒకవైపు మిత్రసేనలు, ఇటలీ ప్రజాశక్తులు. మరో వైపు హిట్లరు సహాయంతో తిరిగి ఇటలీలో ఫాసిజాన్ని నెలకొల్పడానికి కుట్రలు సాగిస్తున్న ఫాసిస్టుమూకలు. ఈ రెండిటిమధ్య సంఘర్షణ ప్రారంభమయింది. బదోగ్లియోలో ఊగిసలాటను అవకాశంగా తీసుకొని హిట్లరు ఇటలీలోకి తన బలాలను పంపించాడు. అక్కడి ఫాసిస్టుల తోడ్పాటుతో ముసోలినీని, ఇతర ఫాసిస్టుప్రముఖుల్ని విడిపించి తీసుకుపోగలిగాడు. అంతేకాకుండా గ్రీసు, యుగోస్లేవియా, ఫ్రాంసు మొదలైన దేశాల్లో కాపు దలగా ఉంచిన ఇటలీ సేనల్ని నిరాయుధం చేసి, బంధించడానికికూడా పూనుకున్నాడు. ఇటలీ ప్రజలపైనే దాడి ప్రారంభించాడు.

ప్రజాపక్షంలో ఇటలీ

ఇటలీప్రజలు దీనికి ఎలా జవాబుచెబుతున్నారు? ఇటలీలో మిత్రసేనలకు పూర్తిగా తోడ్పడుతున్నారు. నాజీలు ఆక్రమించుకున్న ప్రదేశాలన్నిటిలోనూ వారిని ముప్పతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్ళు తాగిస్తున్నారు.

గ్రీసు, యుగోస్లావియా, ఫ్రాంసు మొదలైన దేశాల్లో ఇటలీసైనికులు అక్కడి గెరిల్లా సేనలలో చేరిపోయారు. కార్సికాలో ఉండిన ఇటలీసేన, అక్కడి జర్మను సేనను లొంగదీసి బంధించింది. తరువాత ఫ్రెంచి సేనలు కార్సికాలో దిగడానికి ఈచర్య ఎంతో ఉపకరించింది. తమ ఆయుధాలన్నిటితోను ఇటలీ సైనిక దళాలు ఆక్రమితదేశాల గెరిల్లాలతో చేరడంవల్ల, ఆదేశాల స్వాతంత్ర్య పోరాటానికి ఎంతో లాభం కలిగింది. ముసోలినీ పతనం, ఇటలీ మిత్రరాజ్యాలకు లొంగిపోవడం, యీస్వాతంత్ర్య పోరాటాలకు నూతనోత్సాహం కలిగించింది.

ఈవిధంగా నిన్న మొన్నటివరకు ఫాసిస్టుల ఒత్తిడికింద అక్షరాజ్య కూటమిలో ఉండిన ఇటలీ, ఈనాడు అన్నివిధాల ప్రజాపక్షంలో చేరింది.

ఎలాంటిపరిస్థితుల్లో ఇదిజరిగింది? రెడార్మీ నాజీ నరహంతకుల్ని రూపుమాపుకుంటూ ముందుకొస్తూంది. యూరప్ అంతటా తమ సంకెళ్ళను పగులగొట్టి, శాంతిసౌఖ్యాలను స్థాపించుకోడానికి సంఘటిత ప్రజాశక్తులు సిద్ధంగా ఉన్నాయి. ఇటలీలోనే వివిధ ప్రజాసంస్థల సంయుక్త నాయకత్వం క్రింద అవి సంఘటిత మవుతున్నాయి. నాజీలు పతనమవుతున్నకొలదీ ముందుకొస్తున్నదీ ప్రజాశక్తులే. భవిష్యత్‌లో యూరప్‌కు రూపం ఇవ్వగలవి యివే. అందుకు సందేహంలేదు. ఈ బాటపైన అడుగుపెట్టిన ఇటలీప్రజల్ని ఏశక్తి అడ్డగించి, తిరిగి వెనక్కి నెట్టలేదు.

గుంటూరుజిల్లా వ్యవసాయ కూలీ మహాసభ

మూడవ గుంటూరుజిల్లా వ్యవసాయ కూలీ మహాసభ యీ నెల 14, 15 తేదీలలో రేపల్లె తాలూకా బేతపూడిలో జరిగింది. వివిధ తాలూకాల నుండి 100 మంది ప్రతినిధులు, 6000 మంది ప్రేక్షకులు మహాసభలో పాల్గొన్నారు సుమారు 1000 మంది పేదరైతులు పరిసరగ్రామాలనుండి వచ్చారు. జిల్లా మహిళా శిక్షణ శిబిరం నుండి 25 గురు యువతులు, పరిసర ప్రాంతాలనుండి 800 మంది వ్యవసాయ కూలీ స్త్రీలు ఉత్సాహంతో మహాసభకు వచ్చారు. తెనాలి తాలూకా క్రాప, కఠెవరం, కంచెర్లపాలెం, గ్రామాల నుంచి కూలీలు బ్యాండు వాయిద్యాలతో కాలి నడకను వచ్చి చేరుకున్నారు. గుంటూరు లాగుడు బండ్ల కార్మికులు సౌహార్ద్ర ప్రతినిధులుగా వచ్చారు.

ఊరేగింపు, మహాసభ

14 వ తేదీని మధ్యాహ్నం 2-30 గంటలకు 2000 మంది వ్యవసాయ కూలీలతో, మూడు బారులుగా, ఊరేగింపు బయలుదేరింది. స్వాతంత్ర్య నినాదాలు, కూలీ-రైతులు కోరే హక్కుల నినాదాలు, మిన్నుముట్టాయి. 2 వేలతో బయల్దేరిన ఊరేగింపు 5-30 గంటలకు 4 వేలతో పెండాలుకు తిరిగి వచ్చింది. సామ్రాజ్యవాదయుద్ధపు రోజులలో వ్యవసాయ కూలీల ఆకలియాత్రలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తాంటే భయంతో కొట్లు మూసివేసిన షాహుకార్లు, యీరోజున కూలీల నిర్మాణశక్తిని, ప్రజాహిత కార్యక్రమాన్ని, అర్థంచేసుకొని, కొట్లను మూసివేయలేదు. ఉన్నత కుటుంబాలలో పుట్టి పెరిగిన 300 మంది హైస్కూలు విద్యార్థులు సహితం అమితానందంతో వచ్చి మహాసభలో పాల్గొన్నారు.

ఊరేగింపు పూర్తి అయాక, రేపల్లె తాలూకా వ్యవసాయ కూలీసంఘ కార్యదర్శి, కుడితిపూడి సత్యనారాయణగారు ఎర్రజండాను ప్రతిష్ఠించారు. కూలీగాపుట్టి, కూలీ సంఘాభివృద్ధికై పాటుపడుతూన్న కాబోతు రామస్వామిగారు మహాసభ కధ్యక్షత వహించారు.

సందేశాలు, ఉపన్యాసాలు

అఖిలభారత రైతుసంఘాధ్యక్షులైన బంకిం ముఖర్జీ, కార్యదర్శి స్వామీ సహజానంద సరస్వతి, కృష్ణాజిల్లా వ్యవసాయ కూలీ సంఘంవారూ, పంపినసందేశాలు చదువబడిన తర్వాత, ఆహ్వానసంఘ కార్యదర్శి బడుగు పీటర్‌గారు 1937 నుండి నేటివరకు జిల్లాలో వ్యవసాయకూలీ ఉద్యమం ఎలా అభివృద్ధి చెందిందో వివరించారు. భారతకమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యులైన పి. సుందరయ్యగారు మహాసభకు ప్రారంభోత్సవం జరుపుతూ, కష్టజీవులైన కూలీలు - రైతులు మాతృదేశరక్షణకై ముందుకువచ్చి, ఫాసిజం అనే పెనుభూతాన్నుండి దేశాన్ని కాపాడడం ద్వారానే స్వాతంత్ర్యసంపాదన, రైతు-కూలీ రాజ్యస్థాపన సాధ్యమౌతుందని ఉపన్యసించారు. సభాధ్యక్షులైన కాబోతు రామస్వామిగారు రైతుకూలీల సామరస్యాన్ని గురించి, కుల-మత విచక్షణలేకుండా వ్యవసాయకూలీలందరు సంఘాలలో చేరవలసిన అవసరాన్ని గురించి, ఉపన్యసించారు

తరువాత, ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావుగారు, కమిటీ సభ్యులైన ఎం. బసవపున్నయ్యగారు, గుంటూరు జిల్లా రైతుసంఘాధ్యక్షులైన కొల్లా వెంకయ్యగారు, దేశాన్ని ఆహార సంక్షోభంనుండి రక్షించడానికి, కరువుదోపిళ్లు జరగకుండా జాగ్రత్త పడటానికి, తిండి దొంగల దోపిడీని అరికట్టడానికి, వ్యవసాయ కూలీలందరు రైతులతో చేయి-చేయి కలిపి ముందుకు రావలసిందని హెచ్చరించారు.

వైజ్ఞానిక ప్రదర్శనం

14 వ తేదీ రాత్రి 10 గంటలనుండి 2½ వరకు వైజ్ఞానిక ప్రదర్శనం జరిగింది. పడవపాట, కోలాటం, చెంచీత, అన్నా-చెల్లెలి సంవాదం, బుర్రకథ ప్రేక్షకుల్ని కర్తవ్యోన్ముఖులుగా చేశాయి. చింతల సూర్యనారాయణగారి హాస్య రససంభాషణ, కూలీల సాంఘిక దురాచారాలను తొలగించడానికిసాయపడింది. 10 వేలమంది ప్రేక్షకులు యీ ప్రదర్శనాన్ని చివరవరకు ఉత్సాహంతో విన్నారు. ఆహ్వాన సంఘంవారి విప్లవాభివందనాలతో మహాసభ ముగిసింది. ఫ్యాక్టరీ యజమానులు, ఉద్యోగులు, రైతులు, అన్ని తరగతుల కూలీలు, విరాళాలిచ్చి మహాసభను జయప్రదంగా నడుపుటలో తోడ్పడ్డారు.

తీర్మానాలు, ఎన్నికలు

15 వ తేదీని ప్రతినిధుల సమావేశం జరిగింది. రైతు- కూలీ సామరస్యము, అధికాహారోత్పత్తి, కూలీల కనీస కోర్కెలు, కరువు బాధితులకు సానుభూతి, రాజకీయ ప్రతిష్టంభన, మొదలైన సమస్యలపై తీర్మానాలు గావించబడ్డాయి. ప్రతినిధులు తమతమ ప్రాంతాల పరిస్థితుల్ని గురించి, ఉద్యమాభివృద్ధిని గురించి, మాట్లాడారు. ముందు కార్యక్రమాన్ని నిర్ణయించుకున్నారు.

ఈ క్రిందివారు జిల్లా సభ్యులుగా ఎన్నుకోబడ్డారు.

1. కాబోతు రామస్వామిగారు (అధ్యక్షులు)
2. ఎస్. పి. మల్లికార్జునశర్మగారు (కార్యదర్శి)
3. కుడితిపూడి సత్యంగారు } సహాయకార్యదర్శులు
4. కె. రంగారావుగారు }
5. చిర్రా రామకోటిరెడ్డిగారు
6. వావిలాల వీరభద్రరావుగారు
7. దున్న ఆశీర్వాదంగారు
8. మాదల సీతారామయ్యగారు
0. ధూళిపాళ్ళ రామయ్యగారు
10. బడుగు పీటరుగారు
11. గిడుగు దేవదాసుగారు

"ప్రజాశక్తి" విలేఖరులకు విజ్ఞప్తి

"ప్రజాశక్తి"లో ప్రతివారం మూడుపేజీలు ప్రజాఉద్యమాలను గురించిన వార్తలకు వినియోగిస్తున్నాం. కాని, ఈ వార్తాప్రచురణ ఉండవలసినవిధంగా ఉందా? దీని నిత కన్నా బాగాచేయడానికి మార్గాలున్నాయా? అన్న విషయాన్ని గురించి విలేఖరులు, సంపాదకులు ఇంతవరకు తీవ్రంగా ఆలోచించలేదు. ఇప్పుడీవిషయం ఆలోచించవలసిన సమయం వచ్చింది.

మన రాష్ట్రంలో బ్రహ్మాండమైన ప్రజాఉద్యమాలు సాగుతున్నాయి. బాలసంఘం, వైజ్ఞానిక ప్రచారం మొదలైన కొత్తఉద్యమాలు విశాలప్రదేశాలకు పాకిపోతున్నాయి.

అధికాహారోత్పత్తికోసం అద్భుతమైన కృషి సాగుతూంది. ఈకృషిఫలితంగా గ్రామజీవనంలో గొప్పమార్పులు జరుగుతున్నాయి. మొత్తంమీద ఈ ప్రజాఉద్యమాలు మన సామాజిక జీవనంలో కొత్తదశను ప్రారంభిస్తున్నాయి.

కాని, ఇదంతా "ప్రజాశక్తి"లోని వార్తల పేజీల్లో కనబడుతూందా? లేదు. అక్కడక్కడ జరుగుతున్న విషయాలను గురించి ముక్తసరిగా మూడుమాటలుంటున్నాయి. ఈ మధ్య "దొడ్డమ్మ" బయలుదేరిన తరువాత బాలసంఘం విషయంలో తప్ప, తక్కినఉద్యమాలన్నిటిని గురించి యించుమించు యిదే సంగతి.

ఆయా సంఘటనలవల్ల అక్కడి ప్రజల భావాల్లో కలిగేమార్పు, వాళ్ళల్లో కలిగే చైతన్యం, ఉద్యమం - ఇవేవీకూడా "ప్రజాశక్తి" లో పడుతూన్న వార్తల్లో కనబడడం లేదనే చెప్పాలి. అంటే ఈ వార్తలు సంఘటనల జాబితాలుగా మాత్రమే ఉంటున్నాయి. కాని, సజీవంగా, ఉత్తేజకరంగా ఉండడం లేదు.

ఇక యీవార్తలు అలా ఉండకూడదు. సజీవంగా ఉండాలి.

అంటే —

ఒక్కొక్క సంఘటన జరిగిందంటే దానిని గురించి ప్రజలేమను కుంటున్నారు? ప్రజలలో అది ఏమైనా చైతన్యం కలిగించిందా? వాళ్ళలో అదివరకు నిస్పృహ ఉన్నట్లయితే దానిని ఏమాత్రమైనా తొలగించిందా? ఇలాంటి విషయాలన్నీ యితర ప్రాంతాల ప్రజలు తెలుసుకోవాలి. ఇవి తెలుసుకోవాలంటే ఆసంఘటన జరక్కముందూ, జరిగిన తరువాతా ప్రజలతో కలిసిమెలసి తిరుగుతూ వారిని పరిశీలించాలి. ఒక సమావేశంజరిగిందంటే ఆసమావేశానికి ఎందరొచ్చారు? ఎలాంటెలాంటి వారొచ్చారు? సమావేశంలో చర్చించిన విషయాలను గురించి ఎలాంటి వారిలో ఎలాంటి అభిప్రాయాలు గలిగాయి? మొదలయిన విషయాలన్నింటిని గమనించాలి. ఈ పరిశీలన ఫలితాన్నంతటినీ ఆ సంఘటనను గురించిన వార్తతో చేర్చి పంపాలి. అప్పుడే ఆవార్తను జీవకళలతో ప్రచురించడానికి అవకాశం వుంటుంది.

కొత్త ఉద్యమాలను గురించి వార్తలు పంపేటప్పుడు - ఏదోసభ జరిపాం, సంఘం ఏర్పాటుచేశాం. కార్యవర్గ సభ్యుల నెన్నుకున్నాం అన్న వార్త ఎంతో చప్పగావుంటుంది. అలా కాకుండా ఆఉద్యమం అక్కడి సామాజిక జీవనంలో ఎలాంటి మార్పులకు దారితీస్తోందో పరిశీలించి తెలిపినట్లయితే ఎంతో ఉత్తేజకరంగా ఉంటుందావార్త.

ఉదాహరణకు, అధికాహారోత్పత్తి తీసుకొండి. అనేక ప్రాంతాలలో ఈ ఉద్యమ ఫలితంగా రైతుకూలీ సామరస్యం ఏర్పడుతూంది. ఎంత కష్టపడయినా సరే, ఆహారాన్ని అధికంగా పండించి, తన సోదర ప్రజల ఆకలిబాధలను పోగొట్టడానికి రైతులు ముందుకొస్తున్నారు. అంటే, జాతి జీవనంలో రైతు తనబాధ్యతల్ని గుర్తిస్తున్నాడన్నమాట. దీనితో అతని నిత్య జీవితంలోనే మార్పులు ప్రారంభమవుతున్నాయన్నమాట. వీటి నన్నిటినీ గమనించాలి. వార్తలరూపంగా పంపాలి.

అదేవిధంగా బాలసంఘాలు, వైజ్ఞానిక ప్రచారం మొదలయినవాటినిగురించి.

ఈవిధంగా వార్తలను ప్రచురించిననాడే ప్రజాఉద్యమాల ఫలితంగా ప్రజల్లో కలుగుతూన్న దినదినాభివృద్ధి అందరికీ తెలుస్తుంది.

ఈవివరాల నన్నిటినీ ఆఫీసులోకూర్చున్న సంపాదకులు ఊహించుకోలేరు. ఇవన్నీ స్థానిక విలేఖరులనుంచే రావాలి. ఇందుకోసం విలేఖరులు స్థానికపరిస్థితులను జాగ్రత్తగా శ్రద్ధతో పరిశీలించాలి. ఈవిధంగా చేసిననాడు, వారు చక్కని వార్తలను పంపగలగడమే కాకుండా, ఆరితేరిన ప్రజాసేవకులు కూడా కాగలరు.

మరోవిషయం. "ప్రజాశక్తి"విలేఖరులలో ఒకదోషం వుంది. కమ్యూనిస్టుపార్టీ, ఆపార్టీ నాయకత్వంకిందనున్న ప్రజాసంస్థలు — యివి జరిపే కృషిని గురించే వారు వార్తలు పంపుతున్నారు. ఇవి తప్ప ప్రజాసేవచేసే యితర సంస్థలేవీ లేనట్లేవుంటుంది ప్రజాశక్తివార్తల పేజీలు చదువుతూంటే. అదిచాలదు. ప్రజోపయోగకరమయిన కృషి యే యితరసంస్థలు జరిపినా సరే— దాని విషయమయిన వార్తలు రావాలి. అలా జరిగిననాడే మనరాష్ట్రాన్ని గురించి సమగ్రమైన భోగట్టాను అందజేయగలం.

ఇకమీదట "ప్రజాశక్తి"కి వార్తలనుపంపేటప్పుడు ఈవిషయాల నన్నిటిని దృష్టిలో వుంచుకొని పంపాలి. మాకు వచ్చే వార్తల్లో —యిలాంటి వివరాలిచ్చే వార్తలనే యెంచి వాటినే చక్కగా సవరించి ప్రచురిస్తాం.

రాయలసీమ విరాళాలు

1—9—43 నుండి 22—9—43 వరకు జమలు

కృష్ణా జిల్లా :—	
లింగవరంగ్రామ యువజన, రైతు, మహిళా సంఘాలు	22- 0-0
బల్లిపట్టునుండి	11- 4-0
వీరులపాడు బాలసంఘం	2- 3-0
బెజవాడ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్	25- 0-0
ఉంగుటూరుగ్రామ ప్రజలు	10- 0-0
జమీదింటకుర్రు రైతుసంఘం	12- 0-0
జమీదింటకుర్రు బాలసంఘం	0- 8-6
గుడివాడతాలూకా రైతుసంఘం	5- 1-0
పెనమలూరునుండి	20- 0-0
బెజవాడలో ఒకవ్యక్తి	30- 0-0
పెదసనగల్లు బాలసంఘం	8-10-0
నందిగామ విద్యార్థిసంఘం	10- 0-0
పోలవరం (బం. తా) బాలసంఘం	13- 0-0
కాట్రగడ్డ బ్రదర్సు, బెజవాడ	100- 0-0
గుంటూరు జిల్లా :—	
వేటపాలెం బాలసంఘం	7- 7-0
పర్చూరు యువజనసంఘం	4-10-0
నర్సాయపాలెం బాలసంఘం	1- 9-0
జాలాదినుండి	20- 0-0
చిలకలూరిపేటనుండి	5- -0-0
రైతులలో వసూలు	6- 5-0
విద్యార్థులలో వసూలు	7- 8-0
పశ్చిమ గోదావరి జిల్లా :—	
జిల్లా రైతుసంఘం	164-15-0
భీమవరంనుండి	5- 0-0
తూర్పు గోదావరి జిల్లా :—	
ముంగండ బాలసంఘం	1- 4-0
ఉచ్చిలినుండి	2- 0-0
రాజోలునుండి	2- 5-0
విశాఖజిల్లా భీమిలిపట్నంనుండి	10- 0-0
నెల్లూరుజిల్లా : రైతుసంఘం	26- 5-6
అనంతపురంజిల్లా : ఉరవకొండ	5- 1-0
బియ్యం అమ్మినందున వచ్చింది	15- 0-0
ఇదివరకు ప్రకటించిన జమ	8017-10-7
మొత్తం జమలు	8571-10-7

ఇవిగాక బళ్లారిలోని వర్తకులు 16 గజములు కొత్త గుడ్డలు యిచ్చారు. ఇంకా ముక్కపాడునుండి 48 బట్టలు, ఉంగుటూరునుండి 93 బట్టలు, తేలప్రోలునుండి, ప. గో. జిల్లానుండి మరికొన్ని బట్టలు వచ్చాయి, పెదసనగల్లునుండి ధాన్యం, బియ్యంకూడ వసూలు చేసి పంపారు. ఇదిగాక ఒక బంగారుగాజు, ముక్కుపుడక యిదివరకు వచ్చినవి మావద్దనున్నవి.

చెరుకూరి చలపతిరావు,
ఆఫీసు మేనేజరు
ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం, బెజవాడ.

బెంగాలు రాష్ట్రమా!

బెంగాలు రాష్ట్రమా!
మా దేశ మకుటమా!
"విశ్వకవి" "బంకిమ్"ల
విజ్ఞానసౌధమా!

కరువురాకాని
గజ్జె కదిలింపగా
కాడు బీడాయెనా
కలకత్తనగరమ్ము?

తిండిదొంగల చలవ
పట్టెడన్నమె లేక
ప్రాణాలు విడిచిరా
నిరుపేదలౌ ప్రజలు

ప్రజల సహకార
ప్రాబల్యమేలేక
ఆహారసంక్షోభ
మది చల్లారునా

కసుపుమాడినచోట
కనిపించునా మతము
ఐక్యతా సాధనమె
అంత్యవిజయము సుమా!

దేశరక్షణలోనే
జాతిస్వాతంత్ర్యము
ప్రజల సహకారమే
ఐక్యతావిజయం

పొలిమేరలో పొంచి నీ
గుండెచీల్చగా శత్రువుల్
చూచుచున్నారల్లదే
కాచుకొమ్మింక ఏకమై!

బెంగాలురాష్ట్రమా
మా దేశ మకుటమా
"విశ్వకవి" "బంకిమ్"ల
విజ్ఞానసౌధమా!

—నార్ల చిరంజీవి

రైతు – కూలి సామరస్యం

గుంటూరుజిల్లావడ్లమూడిగ్రామములో, వేరుశనగపంట పీకుటకు, కోయుటకు, యీ దిగువ రీతిగా గ్రామ రైతు, కూలిసంఘములు మజూరి ఏర్పాటు చేసుకొని, అనిర్ణయములకు ఎట్టి విచ్ఛిన్నములు లేకుండా ఐక్యతతో పని నెరవేర్చుకొనుచున్నవి.

వేరుశనగపైరు పీకుటకు ఎకరము ఒకటింటికి రు 3—0—0 (షుమారు 5 గురు చేయగలపని) కాయకోయుటకు, 16 మానికెల దబ్బాకు 0—2—0 చొప్పున కూలి యిస్తున్నారు.

ఇతర గ్రామములనుండి వచ్చే కూలీలు కూడా, ఈ కూలీ నిర్ణయాలకు భిన్నము కలుగచేయకుండా, నిర్ణయాలనుమెచ్చుకుంటూ పనిచేసి వెళ్ళుచున్నారు.

ఈ గ్రామ కూలీ నిర్ణయపు ఏర్పాట్లకు వ్యవసాయ కూలి ప్రజా సామాన్యం రైతులు తమకుచేసిన కూలి నిర్ణయమందు మిక్కిలి తృప్తిని కనబరుచుచున్నారు.

రైతు సామాన్యము, ఇంతమాత్రము కూలి యివ్వనిచో, ఈ కరువులో కూలీల బ్రతుకు దుర్భరమని, ఈ విధముగా కూలి ఇచ్చుట వలన రైతుల కెట్టి నష్టము ఉండదని, భావించుచున్నారు. ఈ మాదిరి కూలి చాలదని కూడా కొందరు భావించుచున్నారు.

నాముపద్ధతికి స్వస్తి

బందరు తాలూకా పల్లెవోలు గ్రామంలో తాలూకా రైతుసంఘ వర్కింగు కమిటీ సభ్యులగు బత్తిని ఆదినారాయణగారి తండ్రి లక్ష్మిపతిగారి "దినం" సందర్భంలో 14-9-43 న వెయ్యి మంది కూలీలకు అన్నదానం చేశారు. ఆరాత్రి "స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం" బుర్రకథ చెప్పించారు. సుమారు వెయ్యిమంది వచ్చారు. కరువు పరిస్థితిని గురించీ, అధికోత్పత్తి అవసరాన్ని గురించీ, కూలి—రైతు సామరస్యాన్ని గురించి చెప్పబడింది. తత్ఫలితంగా ఒక పెద్దరైతు తానిదివరకు కూలీలకు నాముపద్ధతిని ధాన్యం యిస్తున్నాననీ, యికనుండి నాము పద్ధతిని గాక కూలీలకు ధాన్యం అప్పుగానే యిస్తాననీ అన్నాడు. ఆదినారాయణగారు తాలూకా రైతు సంఘానికి 20 రూ. విరాళంగా యిచ్చారు.

❖❖❖

ప్రజాశక్తి చందావివరాలు

★

సంవత్సర చందా	5—0—0
అర్ధ సంవత్సర చందా	2—8—0
పావు సంవత్సర చందా	1—4—0

❖❖❖

ముగ్గురు తిండి దొంగల అరెస్టు

త్రిరిడిశెట్టి పాపారావు (ఖమ్మంమెట్టు), రాయపూడి రోశయ్య (ఖమ్మంమెట్టు), చక్కా వెంకటముత్తయ్య (బెజవాడ) - అను ముగ్గురు షాహుకార్లు రాయనపాడు స్టేషనులో (నైజాం రైల్వే) పోలీసులచేత అరెస్టుచేయబడ్డారు.

వీరు లోగడ నైజాం ప్రాంతాల్లో రూపాయికి రెండున్నర, మూడు శేర్లు చొప్పున గోధుమలు కొని ఖమ్మంమెట్టు, వరంగల్ మొదలైన ప్రాంతాల్లో దాచిఉంచారు. ఆ గోధుముల నిప్పుడు బెజవాడకు దొంగతనంగా చేరుస్తూ, రూపాయికి ఒక శేరు చొప్పున దొంగమార్కెట్టులో అమ్మి విశేష లాభాన్ని సంపాదిస్తున్నారు. పెట్టెలలోను బిచానా చుట్టల్లోను, గలీబుల్లోను, చేతిసంచుల్లోను, ఇంకా ఇతర విధాల సరుకుతెచ్చి, కొండపల్లి, రాయనపాడు స్టేషన్లలో దించి, అక్కడ నుంచి బెజవాడకు బళ్ళమీద, నెత్తిమూటల ద్వారా చేరవేస్తున్నారు. ఈ రహస్య రవాణాలో తిండిదొంగలకు రైల్వే ఉద్యోగుల తోడ్పాటుకూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఈవిధంగా తిండిదొంగలు రోజుకు 150 నుంచి 300 శేర్ల వరకు సరుకు బెజవాడ దొంగ మార్కెట్టుకు చేరుస్తూ వచ్చారు.

దీనిని కనిపెట్టి యీ నెల 15 వ తేదీని ప్రచారరక్షకదళ వాలంటీర్లు ముగ్గురు తిండి దొంగల్ని రాయనపాడు స్టేషనులో పట్టుకున్నారు. కాని ముందుగానే ప్రజలను సమీకరించలేక పోవడం వల్ల వారిని విడిచిపెట్టవలసివచ్చింది. మరునాడుకూడా ఇంతేజరిగింది.

17 వ తేదీని బెజవాడ తాలూకా రైతు సంఘ కార్యదర్శి రాయనపాడు వెళ్ళి, ఈనాడు ఆహార సంక్షోభానికి తిండిదొంగలెలా ముఖ్య కారణమో ప్రజలకు విశదపరిచి, ప్రజల ఉపేక్షాభావాన్ని తొలగించారు. తిండిదొంగలను పట్టుకోడానికి ప్రజలుకూడా ముందుకొచ్చారు.

19వ తేదీనుంచి గ్రామ యువజన సంఘం తరపున కొందరు వాలంటీర్లు స్టేషనులో కాపలాఉండి, 20 వ తేదీని ఇద్దర్ని, మరునాడు మరొకనిని - ఈవిధంగా పై ముగ్గురు తిండిదొంగల్ని పట్టుకున్నారు. పోలీసులు వీరిని అరెస్టుచేశారు.

ఈ తిండిదొంగలు అటు నైజాం ప్రాంతాల్లో గోధుములు కొని దాచివేయడం వల్ల, ఇటు బెజవాడ మొదలైనచోట్ల దొంగ మార్కెట్లు పెట్టి పెచ్చుధరలకు అమ్మడంవల్ల - అడాపెడా ప్రజలను దారుణమైన కరువుబాధలకు ఆహుతి చేస్తున్నారు. ప్రజలు ఈ ఘాతకుల్ని ఈ రెండు ప్రాంతాల్లోను బట్టబయలు చేసి, వీరికి తగిన శాస్తి జరిపించి, ఇతర తిండిదొంగలకు గుణపాఠం నేర్పాలి.

మహిళాలోకం

గుంటూరుజిల్లా మహిళావైజ్ఞానిక శిక్షణా శిబిరం గుంటూరు జిల్లా మహిళా ప్రచారక సంఘం యాజమాన్యమున తెనాలి తాలూకా కొల్లిపరలో 15-8-43 నుండి 11—9—43 వరకు జయప్రదంగా జరిగింది. 18 మంది విద్యార్థినులు శిబిరానికి వచ్చారు. ఇందులో నెల్లూరు నుండి వచ్చినవా రొకరు.

దేశ చరిత్ర, రాజకీయాలు, రాజకీయ భూగోళం, మహిళా ఉద్యమం, ఇతర దేశాల స్త్రీ ఉద్యమం, వివాహం - వారసత్వ హక్కులు, శారీరక పరిశ్రమ - ఆరోగ్య విధులు గురించి పలువురు ప్రముఖులు ఉపన్యసించారు.

విద్యార్థినులు, ఇంకా విమానదాడి రక్షణ పద్ధతులను, సమిష్టిగానం, పత్రికా పఠనమూ నేర్చుకున్నారు.

కొల్లూరు కోఆపరేటివు ఇన్‌స్పెక్టరు, "కోఆపరేటివ్ సంఘాలు - స్టోర్సు" (సహకార సంస్థలు - అంగడులు) ను గురించి ఉపన్యసించారు. తెనాలి వ్యవసాయశాఖ డిమాన్‌స్ట్రేటర్ వ్యవసాయాభివృద్ధి - అధికోత్పత్తిని గురించి, మంచి కూరగాయలను పండించడం గురించి, సలహాలిచ్చారు. జిల్లా మెడికల్ ఆఫీసరు, ప్రసూతి సంబంధ విషయాలను, బిడ్డల పోషణను గూర్చి, పటాలను, చార్టులను, బొమ్మలను చూపి చక్కగా వివరించారు.

అప్పుడప్పుడూ చర్చలు జరిపి విద్యార్థినులు తమ వుపన్యాస శక్తిని పెంపొందించుకొన్నారు. ఆచర్చలకు స్థానిక స్త్రీలనుగూడ ఆహ్వానించి, వారిలోగూడ చైతన్యం పెంపొందించారు.

ఈ శిబిరం సందర్భంలోనే, గ్రామ లో అనేకసార్లు బహిరంగ సమావేశాలు జరిగాయి. శిబిరప్రారంభంలో ఊరేగింపు, బహిరంగసభ జరిగింది. శిబిరఉద్దేశ్యాలనుగురించి ప్రచారకులు తెలియజేశారు. మరొకసారి వ్యవసాయశాఖాధికారి ప్రస్తుతం రైతుల కుపయోగకరమయిన బిల్లులనుగురించి తెలియజేశారు. రాజారావుగారు విలువిద్యా ప్రదర్శనం జరిపారు. జిల్లా వైజ్ఞానిక దంవారు బుర్రకథ చెప్పారు. చిత్రవిచిత్రవేషాలతో ప్రబోధం గావించారు. శిబిరం ముగిసే సందర్భంలో, 5 దళాలుగా విద్యార్థినులు ఏర్పడి, ఇంటింటికి తిరిగి మహిళాసభ్యత్వం చేర్పించారు. శిబిరానికి ధనధాన్యాదులను ప్రోగుచేశారు.

శిబిరం ముగిసే సందర్భంలో మాకినేని జగదాంబగారి అధ్యక్షతను మహిళా సమావేశం జరిగింది. ఫండుకు 55-0-0, లోలాకులు, కాళ్ళ పట్టాలు, గాజులు విరాళాలు యిచ్చారు.

శిబిరంలో శిక్షణ పడసిన విద్యార్థినులు, బేతపూడిలో జరిగిన వ్యవసాయకూలీ మహాసభను గురించి వివిధగ్రామాలలో ప్రచారం చేసి, మహాసభలో పాల్గొన్నారు.

* * *

కృష్ణాజిల్లా చినవోగిరాల, గణపవరం గ్రామాలలో మహిళాసంఘా లేర్పడినాయి.

రాయలసీమలో....

అనంతపురంజిల్లా యందలి పెనుగొండ తాలూకాలో కొత్తచెరువు కరువు నివారణ క్యాంపును ప్రభుత్వం ఎత్తివేయుటకు, అక్కడికి 10 మైళ్ల దూరంలో యింకొక క్యాంపును నిర్మించుటకు నిశ్చయించింది. ఇందువల్ల 6 వేల మంది కూలీల కూటిలో మట్టి పడుతుంది. పిడుగువంటి యీవార్తను విన్న తోడనే, కూలీలుపడ్డ బాధ వర్ణనాతీతం. వెంటనే లోచర్లనుండి నరసింహప్ప, వెంకటరెడ్డి, రంగారెడ్డి, అను ముగ్గురు ప్రజా సేవకులు కొత్తచెరువుకుపోయి, అక్కడి క్యాంపును మరొక చోటికి మార్చవద్దని కోరుతూ ప్రభుత్వాధికార్లకు 400 మంది కూలీలచేత మహజరు పెట్టించారు. ఇదిగాక, క్యాంపుకు చుట్టుపట్లనున్న 15, 20 గ్రామాల రైతులందరిచేత సంతకాలు చేయించి, మహజర్లను జిల్లా అధికారులకు పంపుటకై రాత్రింబగళ్ళు కృషిజేస్తున్నారు.

ఇంతేకాదు. కరువుక్యాంపులలో పనిచేసే ప్రతి కూలీకి న్యాయం కలిగించడంలో వాలంటీర్లు శ్రద్ధవహిస్తున్నారు. ఈమధ్య ఒక చిల్లర వర్తకుడు కరువు క్యాంపులో పనిచేసే ఒక పేద స్త్రీ కూలీవద్ద 8 అణాలు తీసుకొని ఒక శేరు బియ్యం మాత్రమే యిచ్చాడు. వాలంటీర్లు గ్రామస్థుల సహాయంతో వర్తకునిపై ఒత్తిడి తీసుకొచ్చారు. చివరకతడు 8 అణాలలో 3 అణాలు ఆ స్త్రీకి వాపసు యిచ్చుట కంగీకరించాడు.

పెనుగొండ తాలూకాలోనే, లోచర్ల గ్రామంలో 2, 3 నెలలుగా కొందరు కల్లుతెచ్చి రహస్యంగా అమ్ముతూన్నట్లు వాలంటీర్లు తెలుసుకున్నారు. వెంటనే నరసింహప్ప, రంగారెడ్డి, వెంకటరెడ్డి, వెంకటరాముడు గార్లు దుకాణదార్లవద్దకువెళ్ళి, అమ్మవద్దని బోధించారు. కాని, వారు వినలేదు. ఆ గ్రామస్తులతోను, రెడ్డి - కరణం గార్లతోను, యీ విషయం చెప్పి, వారందరి సహకారంతో 13-9-43 వ తేదీని కల్లుకుండలను పట్టుకొని, గ్రామ చావడికి తెచ్చి, కేసుపెట్టించారు.

ప్రజాసేవకునిపై నిరంకుశత్వం

రాయలసీమలోని కరువు బాధితులకు అన్ని విధాల సహాయంచేయడానికి ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘం పంపిన వాలంటీర్లలో ఒకరు కామ్రేడ్ ఏ. పరమానంద. ఈయన కడపజిల్లాలో పనిచేస్తుండేవారు.

ఎవరో దుండగీడులు టెలిఫోను తీగలు తెగగొట్టి నందుకు పులివేందుల సబ్ ఇన్‌స్పెక్టరు, సర్కిల్ పరమానందను గత మాసం 29 తేదీన అరెస్టుచేసి, లాకప్‌లో పెట్టారు. తీగలు తెగగొట్టిన దెవరో చెప్పమని కామ్రేడ్‌ని హంటరుతో బాదారు. విధ్వంసక చర్యలు కమ్యూనిస్టుల కార్యక్రమం కాదని, ఆచర్యలకు ఒడికట్టేవానిని ప్రజల యెదుట బయలుపర్చడం కమ్యూనిస్టులపాలనీ అని కామ్రేడ్ ఎంత చెప్పినా, వారి నెత్తికెక్కలేదు. 30 వ తేదీని అతన్ని డిప్యూటీ కలక్టరు దగ్గరకు తీసుకువెళ్ళారు. విచారణను 13 వ తేదీకి వాయిదావేశారు.

సబ్‌జైలులో కామ్రేడ్‌కు సంగటి ముద్ద యిచ్చారు. అందుకు నిరసనగా ఒకరోజు భోజనం మానిన మీదట అన్నం పెట్టారు. 13 వ తేదీ విచారణలో కామ్రేడ్ తాను కరువు బాధలను తొలగించడానికి, అధికాహారోత్పత్తి సాగించడానికికృషిచేస్తున్నానని వివరించాడు. దేశరక్షణకు ఏమాత్రం భంగం కలుగకుండా చేయడమే తన కర్తవ్యమని విశదపరచాడు.

అయినా డిప్యూటీ కలెక్టరు, డిప్యూటీ సూపరింటెండెంటు కామ్రేడ్‌ని కడపజిల్లా విడచిపొమ్మన్నారు

ఈ చర్య ఎంత అక్రమమో వేరే చెప్పనక్కరలేదు. టెలిఫోను తీగలను తెగనరికిన దుండగీడుని పట్టుకోలేక పోలీసులు ఒక ప్రజాసేవకునిపైకి దాడివెళ్ళారు. అధికారులీ దాడికి పక్కతాళం వేశారు. తమ ఆటలకు అడ్డులేకుండా ప్రజాసేవకులను తొలగించడమే ఈ అధికారుల ఉద్దేశంలాగుంది. ఇలాంటి ప్రవర్తనవల్ల, యిప్పటికే కరువుతో మాడిపోతున్న కడపజిల్లాలో యింకెంత అశాంతి ప్రజల్లగలదో ప్రభుత్వం గుర్తించి, దీని నరికట్టాలి.

బాలబాలికలకు

— దొడ్డమ్మ —

గుంటూరుజిల్లా మంచికలపూడిలో బాలసంఘం వుంది. బాలసంఘంలో ఉన్నవాళ్ళంతా సంఘపు బాడ్జిని పెట్టుకొని వస్తూఉంటారు. కాని ఒక బాలుడు పెట్టుకొని రావటంలేదు. "ఎందుకు పెట్టుకోడం లేద"ని అంతా అడిగారు. "నాకు చొక్కాలేదు. బాడ్జి ఎక్కడ పెట్టుకోను? నేను బీదవాణ్ణి" అని అతడు సమాధానమిచ్చాడు. బాలసంఘం జాలిపడి వెంటనే రు 3—0—0 వసూలుచేసి చొక్కాలు కుట్టించి పెట్టింది. కుట్టుపనివాడు కూడా ఊరికే కుట్టి ఇస్తానన్నాడు. చూచారా వాళ్ళు ఒకరి కొకరు ఎలా సహాయం చేసుకొంటున్నారో!

పశ్చిమగోదావరిజిల్లా చింతలపూడి తాలూకాలో యర్రింపల్లి గ్రామంవుంది. ఆవూరిలో, పిల్లలు సరిగా బడికి రాకపోవడంచేత ఎలిమెంటరీ పాఠశాలను ఎత్తివేయాలని అధికారులు తలచారు. ఈవిషయం తెలిసి, పిల్లలు ప్రతివారిని బడికివచ్చేటట్లు కృషిచేస్తున్నారు. చదువు అంటే అంత శ్రద్ధఉండాలి.

గుడ్లవల్లేరులో వర్తకులు అట్లతదియనాడు బాలురకు కొబ్బరికాయలు యిచ్చే అలవాటు వుంది. అలా వచ్చిన కొబ్బరికాయలు తాము తినకుండా త్యాగం చేశారు. వాటిని అమ్మి, వచ్చిన రు. 32-0-0 లను రాయలసీమనిధికి గాను "ఆంధ్రప్రభ"కు పంపారు.

బాలసంఘాలవల్ల మీ ప్రవర్తన ఎంతబాగుపడుతున్నదో చూడండి.

గుంటూరుజిల్లా పర్చూరుగ్రామంలో ఒక బాలుడు, తాను ఇంట్లోచేసిన దొంగతనాన్ని ఒప్పుకొని, ఇకనెన్నడూ చేయనని వాగ్దానం చేశాడు.

మైలవరంలో ఇద్దరు బాలురు, గోడలపై బొమ్మలు, పిచ్చిపిచ్చి వ్రాతలు, వ్రాయడం ఇక మానివేస్తామన్నారు. ఇతరుల్ని కొట్టడం మొదలైన రౌడీ చర్యలు మానివేస్తామన్నారు. మరొక 7 సంవత్సరాల బాలుడు తన అన్న పుస్తకాన్ని చింపుట తప్పని తెలిసికొన్నాడు. తండ్రి ముందు తన తప్పును అంగీకరించి, అన్నకు మరొక పుస్తకంకొని పెట్టమని ప్రార్థించాడు. ఈవిషయమంతా బాలసంఘానికి చెప్పాడు.

ఈవిధంగా ఆత్మవిమర్శతో, బాలబాలికలు తమ జీవితాన్ని దిద్దుకొని పెద్దలకే ఆదర్శమార్గాన్ని చూపుతున్నారు.

(8 వ పేజీ తరువాయి) కృష్ణయ్యగారివంటి దేశభక్తులు అధ్యక్షతవహించి, దేశద్రోహిని ప్రజలకు కాంగ్రెసువాదిగా యెరుకపరచడం కాంగ్రెసు తీర్మానాలకే విరుద్ధమైన విషయం. ఈసంగతి నిదానంగా ఆలోచించుకుంటే దేశభక్తులందరికి విదితమవుతుంది.

పంచమాంగదళ దగాలో పడవద్దని, కమ్యూనిస్టులపై ద్వేషంతో దేశద్రోహుల ప్రచారానికి, రొచ్చుగుంటె పత్రికల నిందలను వ్యాపింపజేసి తమ కీర్తికి కళంకం తెచ్చుకోవద్దని కాంగ్రెసు దేశభక్తులకు మామనవి. ఇదే సోదర దేశభక్తులకు మా విజ్ఞప్తి; తోడి స్వాతంత్ర్య సాధకుల వినయపూర్వక హెచ్చరిక.

ఎరువుల ధరల కంట్రోలు

గుంటూరుజిల్లాలో రైతుసంఘాల ఆందోళన ఫలితంగా జిల్లాకలెక్టరు విశాఖపట్టణం నుండి వచ్చే వేరుశనగపిండి పుట్టి 1కి 22-13-0, గుంటూరుజిల్లాలోనిది పుట్టి 1-కి రు 24 లు, అమోనియా సల్ఫేట్ బస్తా రు 28 లు, మిక్సర్సు బస్తా రు 9 లకు, మించి అమ్మరాదని; సక్రమంగా అందించకపోతే నిల్వలు స్వాధీనపరచుకొని రైతుల కందిస్తామని ప్రకటించారు.

కాని ఆరు బస్తాల పిండికంటె హెచ్చు వేసేకాలంలోకూడా రైతువద్ద అనుమతిలేనిదే ఉంచరాదని ప్రకటనలో ఉంది. ఆముదపు పిండి ధరను కంట్రోలు చేయలేదు. సక్రమ పంపకమును సాగించుటకు రైతుసంఘ ప్రతినిధితో కూడిన కమిటీ నేర్పరచ వలెననే కోర్కెను తీర్చలేదు. ఈ లోటులను సవరించాలంటే వర్కర్లు రైతుల నైక్యపరిచి అధికారులపై ఒత్తిడి తేవాలని, గుంటూరు జిల్లా రైతుసంఘం తరపున అధ్యక్ష కార్యదర్శులు హెచ్చరిస్తున్నారు.

యుద్ధసమీక్ష

■ స్మోలెన్స్కుపై ఎర్రజండా ■ ఫేసిస్టు చెరనుండి విముక్తి చెందిన దేశాలలో పాలన ఎలా ఉండాలి?

స్మోలెన్స్కును రెడ్‌ఆర్మీ వశపరచుకొంది. మాస్కోపై దండయాత్రకు కీలకస్థానమై, హిట్లరు ప్రధాన కార్యాలయానికి కొన్నాళ్ళు స్థావరమైన ప్రసిద్ధిచెందిన స్మోలెన్స్కుపైనేడుతిరిగిఎర్రజండాఆడుతోంది. రెడ్ ఆర్మీ తనమాతృమూర్తికిగ్రుచ్చుచున్నవిజయహారానికి ఇది ఒక మణిపూస. పతనోన్ముఖులైన హిట్లరు బందిపోటుముఠా గుండెకిది మరొక బల్లెపుపోటు.

స్మోలెన్స్కు, రోస్లావాల్‌లను పట్టుకొనక ముందే రెడ్‌ఆర్మీ స్మోలెన్స్కుకు వాయువ్యంగానున్న వెలిజీని పట్టుకొని, స్మోలెన్స్కు-విటబిస్కు రైల్వేలైను తెగగొట్టింది. ఆ విధంగా స్మోలెన్స్కుకు ఇరుప్రక్కల ఒత్తిడి తెచ్చింది. ఇప్పుడా సైన్యం విటబిస్కువైపుకు పురోగమించుతోంది. దీనికి 30 మైళ్ళలోకి వచ్చింది. వైట్ రష్యాలోకి రెడ్‌ఆర్మీ అడుగుపెట్టింది.

గోమెల్‌ను 3 వైపుల ముట్టడించుతున్న రెడ్‌ఆర్మీ ఒకచోట 30 మైళ్ళలోను, మరొకచోట 50 మైళ్లలోకి వచ్చింది.

కీవ్ మొదలుకొని, నీపర్ పెట్రోవస్కు వరకు, నీపర్‌నదిని చేరుటేగాక, అనేకచోట్ల నీపర్‌నదిని దాటి పశ్చిమ తీరాన రెడార్మీ స్థావరాలను ఏర్పరిచిందని ఒక వార్త. పోల్టావాను ఆక్రమించుకొన్న రెడ్‌ఆర్మీ ఇదివరకే నీపర్ పెట్రోవ్‌స్కు చేరింది. కీవ్‌ను జర్మన్లు ఖాళీచేయుచున్నారని మరొక వార్త. సోవియటు సైనికులు గాలిగుమ్మటాలద్వారా, నీపర్‌నది పడమటి ఒడ్డున దిగి జర్మన్ల పని పట్టిస్తున్నారని జర్మనీయే ఒప్పుకొంటున్నది.

క్యూబాన్‌లో (నల్లసముద్ర తీరాన) "అనపా"ను ఆక్రమించింది రెడ్‌ఆర్మీ. క్యూబాన్ నుండి పారిపోతున్న జర్మన్లపై సోవియటు విమానదళం బాంబుల వర్షంకురిపించుతోంది.

ఈ విజయాల అంతరార్థం ఏమిటి? ఆయుధాలలోను, అంగబలంలోనురెడ్‌ఆర్మీదే పైచేయి అని జర్మనీయే ఒప్పుకొంటున్నది. కాని ఇది ఒక్కటేకారణంగాదు. రెడ్‌ఆర్మీ కూడ ఒకపుడు, జర్మనులకు తాత్కాలిక అదనపుబలం ఉన్నప్పుడు, వెనుదిరిగింది. కాని ఈ రెండింటికే చాల వ్యత్యాసముంది.

నేడు జర్మను సైన్యాల మనోనిబ్బరం దిగజారిపోయింది. ఇది జర్మను తిరోగమనానికి ముఖ్యకారణం. ఈదెబ్బనుండి జర్మనీకోలుకోజాలదు. జర్మన్లు గావించుచున్న తిరోగమనం వారు వేస్తున్న ఒక ఎత్తుగడ కాదు. సోవియటు పవిత్రభూమినుండి జర్మన్లనడుము విరగదన్ని తరిమివేస్తోంది రెడ్‌ఆర్మీ. కీవ్, నీపర్‌పెట్రోవ్‌స్కులు స్వాధీనంచేసికొన్న తర్వాత, నీపర్‌నదిని అనేకచోట్ల దాటిన తర్వాత, రెడ్‌ఆర్మీకి శత్రువులను తమమాతృభూమి వెలుపలికి తరిమే సమయం, లేక తమ మాతృభూమిలోనే చుట్టుముట్టి హతమార్చేసమయం, ఎంతోదూరాన వుండదు.

నాజీజర్మనీ పారిశ్రామిక పట్టణాలపై బాంబులవర్షం, ఇటలీ పతనం, జర్మను పరిశ్రమలకు కార్మికుల కొరత — ఇవన్నీ జర్మనీకి తీరని నష్టాన్ని కలుగజేస్తున్నాయి.

1918 నాటి ఆ జయభూతం జర్మనుప్రజల కళ్ళముందు తిరిగి తాండవించుతోంది. "ఏది ఏమైనా కాసియుండి — లొంగిపోము" అని గోబెల్సు యెంతబింకంగా పలికినా జర్మన్లు నమ్మలేరు.

1918 నాటికంటె కూడ మహావిపత్తును జర్మనుప్రజలకు హిట్లరు సమకూర్చుసున్న యీసమయంలో, కొన్ని అభివృద్ధికాముక శక్తులు మేల్కొంటున్నాయి. తూర్పు జర్మనీలో రహస్యంగా "యుద్ధవ్యతిరేక" ఉద్యమం బయలుదేరింది. జర్మను నేషనల్ కమిటీ (సోవియటులో జర్మన్లచే స్థాపించబడింది) ప్రతిరోజూ రేడియోలో, హిట్లరును కూలద్రోయవలసినదని హెచ్చరించుతోంది. మాస్కోలో జర్మను ఆఫీసర్లు (ఖైదీలు) సమావేశమై హిట్లరును కూలద్రోయండని సైనికాధిపతులకు విజ్ఞప్తిగావించారు. ఈవిధంగా జర్మనీలోను, జర్మనీబయటను హిట్లరు ప్రతికూల ఉద్యమం నానాటికి పెంపొందుతోంది.

ఇటలీయుద్ధంలో అంతగా మార్పులేదు. నేపుల్స్ మైదానప్రాంతాలకు మిత్రసైన్యాలు సమీపిస్తున్నాయి. ఇటలీ తూర్పుతీరంలో (ఆడ్రియాటిక్ సముద్రతీరం) బారి రేవును పట్టుకొన్న మిత్రసైన్యాలు ఫాజియాను సమీపించుతున్నాయి. స్వతంత్రఫ్రెంచియోధులు, మిత్రరాజ్య సైనికసహాయంతో సామ్రాజ్యవాదుల అంచనాకంటె ముందుగానే, కోర్సికా దీవిలోని బాస్టియా రేవు పట్టణాన్ని ఆక్రమించి, కోర్సికా ఆక్రమణను పూర్తిచేస్తున్నారు. మిత్రరాజ్య సైనికుల సాయంతో తమ స్వాతంత్ర్యయుద్ధాన్ని సాగించే ఇటాలియన్ ప్రజలకు ముస్సోలినీ రేడియో ఉపన్యాసాలు ఏమీ పనిచెయ్యవు. తప్పంతా రాచరికవాదులదేననీ, తమదికాదనీ ముస్సోలినీ చెప్పే మాటలు నమ్మేటంతటి మూఢులు యింకా ఇటలీలో వున్నారనుకోడం పొరబాటు.

యుగొస్లోవియాలో గెరిల్లాల తిరుగుబాటు హెచ్చింది. రైళ్లు పడగొట్టడం, కొన్ని పట్టణాలలో (సుసాక్) వీధిపోరాటాలు జరపడం జరుగుతుంది. ఇదివరకు జనరల్ మిహిలోవిచ్‌కి తప్పమరెవరికీ మిత్రరాజ్యాలు ఆయుధసహాయం చేసేవికావు. ఇపుడు, కమ్యూనిస్టు గెరిల్లాలకు కూడ ఆయుధాలీయడానికి మిత్రరాజ్యాలు అంగీకరించాయి. దీనిఅర్థం, ద్రోహి మిహిలోవిచ్ పలుకుబడి తగ్గుతున్నదని మిత్రరాజ్యాలు గ్రహించాయన్నమాట. అలాగే గ్రీకు గెరిల్లాపోరాటంకూడ పెంపొందుతోంది. గ్రీకు గెరిల్లానాయకులు, తమ రాజును సైన్యంతోపాటు గ్రీసులో దిగవద్దని హెచ్చరించారు. జనరల్ మెటాక్సస్ నియంతృత్వానికి కారకుడైన రాజును రావద్దని వారుకోరుతున్నారు. ఫేసిస్టు జర్మనీని కూలద్రోయటతోబాటు నిరంకుశ రాజులపరిపాలనకు గూడ స్వస్తి చెప్పగలమనే ఆత్మవిశ్వాసాన్ని ఆ గెరిల్లానాయకులు వెలిబుచ్చుతున్నారు.

పైఘటనలన్నీ ఏమి తెలియజేస్తున్నాయి? యుద్ధంలో నూతనదశ ప్రారంభమైనదని. ఫాసిజమూ దాని యుద్ధయంత్రమూనశించి, ప్రజలకు ఫేసిస్టులనుండి విముక్తికల్గే పరిస్థితులేర్పడ్డాయని ఈదశ తెల్పుతుంది.

కాని ఇవన్నీ వాటంతటకవే జరగవు. ఈ దశకుతగిన చర్యలను అమెరికా బ్రిటనులు గావించాలి. అది ఇంగ్లీషు ఛానెల్‌దాటి ఫ్రాంసుపై దండయాత్ర జరపడం, బ్రిటిషు కార్మికులిదే వాంఛిస్తున్నారనడానికి నిదర్శనం 4 వ తేదీన ట్రఫేల్గర్ స్క్వేర్ (లండన్)లో జరిగిన బ్రహ్మాండ ప్రదర్శనమే. "సంపూర్ణ బలంతో దండెత్తండని" వారినినాదం. ఆస్ట్రేలియన్ కార్మిక వర్గంకూడ ఇదేవాంఛిస్తోంది. ఈ విషయంలో బ్రిటిషు మితవాద కార్మిక నాయకుల వైఖరియెడల అసమ్మతికూడా చూపింది. కాని చర్చిలు ఉపన్యాసంలో, త్వరలో ఫ్రాంసుపైదండెత్తుతారనే సూచన ఎక్కడా కన్పించలేదు.

ప్రజా తిరుగుబాట్లకు తోడుగా మిత్రరాజ్యాలు సైనికంగా దెబ్బలు తీయాలి. అప్పుడే ఫాసిజం త్వరగా నశించుతుంది. అలా చేయకపోవడంవల్ల ఇటలీలో కల్గిన నష్టం చూస్తున్నాం. "డైలీ వర్కరు" విమర్శించినట్లు, ఇటలీపై దండయాత్ర ఆలస్యంచేశారు. జినోవా వద్ద మిత్రరాజ్యాలుదిగితే, మిలాన్ - ట్యూరిన్ లలోని కార్మికుల తిరుగుబాట్లు ఎంతోసహాయపడేవి. కాని మిత్రరాజ్యాలు అలాచేయలేదు.

ఇలాంటి తప్పులకు కారణం, సైనికబలాన్ని రాజకీయ శక్తులనుండి విడదీసిచూసే సామ్రాజ్యవాది వైఖరియే. ఆవైఖరియే నేటి భారత దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడంలేదు. ఇది మిత్రరాజ్యాలలోని ఫాసిస్టు అనుకూలుర బలాన్ని పెంపొందించడానికి హిట్లరు పతనాన్ని ఆలస్యంచేయడానికిసహాయపడుతుంది.

అందుకనే సోవియటు పత్రిక "వార్‌అండ్ వర్కింగ్‌క్లాస్" "అమ్‌గాట్" (ఎలైడ్ మిలటరీ గవర్నమెంట్—మిత్రరాజ్య మిలటరీ ప్రభుత్వం)ను విమర్శించింది. సిసిలీలో ఏర్పడ్డ ఈ ప్రభుత్వాన్ని గురించి అనేక పత్రికలలో వెలువడ్డ వార్తలను ఆధారంగా చూపుతూ పై పత్రిక ఇలావ్రాసింది. "ఈమిలటరీ ప్రభుత్వం తాత్కాలికంగానేనా? చాలకాలం వరకా? గ్రీసు, యుగోస్లేవియా, ఫ్రాంసులపై దండయాత్ర చేసిన తర్వాతకూడ ఇలాగే ఏర్పరుచుతారా?" ఫాసిజాన్ని నాశనంచేయుటలో ప్రజాశక్తుల రాజకీయ ప్రాముఖ్యతను గుర్తించకపోవడమే ఇలాంటి ప్రభుత్వాలను నిర్మించడానికి కారణమని, ఈపత్రిక హెచ్చరించింది ఇకా "విముక్తి నొందిన దేశాలలో ఆర్థిక పునర్నిర్మాణ సమస్య ప్రజలకు విడిచిపెట్టాలి" అని హెచ్చరించింది. దీనిపై ఈడెన్ ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదు.

యుద్ధం యొక్క ఈ నూతన పరిస్థితిలో, బ్రిటన్, అమెరికా, ఫ్రీఫ్రెంచి కమిటీ, సోవియటురష్యాలతో గూడిన శాశ్వత కమిటీ ఉండాలి. ఈ వాంఛను "వార్ అండ్ వర్కింగుక్లాసు" వెలిబుచ్చింది. అలాంటి కమిటీయే మిత్రరాజ్యాల మిలటరీ చర్యలకూ ఫేసిస్టు ప్రతికూల ప్రజాతిరుగుబాట్లకూ ముడిపెట్టగలదు. అలాంటి కమిటీకి ఎంతప్రజలఒత్తిడి ఉన్నదో నిదర్శనం చూడండి. ఈడెన్‌తాము గూడ రష్యాతో అట్టిసహకారంకోసం ప్రయత్నించుతున్నామని చెప్పుటయే ఇందుకు ప్రబల నిదర్శనం.

మెడిటరేనియన్ కమిషన్, ఇట్టిసహకార ప్రయత్నాలలో ఒకటి, చర్చిల్ యీ కమిటీ ప్రాముఖ్యతను తగ్గించివేస్తూ ఉపన్యసించాడు. కాని కామ్రేడ్ విషిన్స్కీని (సోవియటు విదేశాంగ ఉపమంత్రి) సోవియటు నియమించుటలో దీని ప్రాముఖ్యత బయటపడుతోంది. ఫాసిస్టుదాస్యంనుండి విముక్తిచెందినప్రజలకు సోవియటు అండ వుంటుందని దీని అర్థం.

ప్రజలు యెంతజాగ్రత్తగా, ప్రతిఘటననూ పరిశీలించుతూ, సామ్రాజ్యవాదులలోని అభివృద్ధినిరోధకముఠా చర్యలను పరిశీలించుతున్నారో చూడండి. ఫ్రాంకో—హోరుల సంభాషణలపై పార్లమెంటులో అడిగిన ప్రశ్నలే యిందుకు నిదర్శనం. దీనినిబట్టి గాలి యెటు వీస్తున్నదో తేలుతుంది. ఆంగ్లో—అమెరికన్—సోవియటుశాశ్వతకమిటీకై గూడప్రజలఒత్తిడి నానాటికి వృద్ధికాక తప్పదు. 27—9—43.

— తుమ్మల వెంకటరామయ్య

(8 వ పేజీ తరువాయి) సుహృద్భావంతో దేశంలో అన్నివైపులనుండి వంపుతున్న సహాయాన్నిపీడితులకు అందజేయడంలో యీపార్టీ విభేదాలెందుకు? అన్నిపార్టీలుఐక్యతతో కరువు నివారణకార్యాలు జరిపితే పీడితులకు హెచ్చు సహాయం చేయ వీలుపడుతుందిగదా! కరువు నివారణే జాతీయైక్యతనిర్మాణానికి పునాదిఅవుతుందనే సంగతి దేశభక్తులు గమనించాలి.

కరువు బిడ్డకు బాధ్యు లెవరు?

బెంగాల్ అసెంబ్లీలో 22 వతేదీన జరిగిన అల్లరి, వివిధపార్టీలు ఒండొరులను నిందించుకోడం పై సంకుచితదృష్టినే తెలియజేస్తుంది. ఇండియా ప్రభుత్వం, రాష్ట్ర స్వపరిపాలన యిచ్చివేశాం కాబట్టి కరువుకు బాధ్యతఅంతా రాష్ట్రానిదే అంటూంది. ప్రభుత్వ వ్యతిరేకపక్షమయిన, హక్కు - శ్యామ్‌ప్రసాద్ ముఠా యీసంక్షోభాని కంతకి బాధ్యత లీగ్ మంత్రివర్గానిదే అని నిందించుతూంది. మంత్రివర్గం హక్కు ముఠా అధికారంలో వుండగా చేసిన అవకతవకలే ప్రస్తుత విషమావస్థకు కారణమని నిందించుతోంది. ఒకవైపున ప్రజలు తిండిలేక మలమలమాడిపోతూంటే, తన్నివారణకు దేశభక్తులు, ప్రజాసేవకులు అంతా కలిసి పనిచేయవలసిన సమయంలో యీవిధంగా పార్టీకక్షలు సాధించడం, మంత్రివర్గాన్ని కూలద్రోయడానికి ప్రయత్నాలు యెంతప్రమాదకరమయినవి? ఇది గోతికాడ నక్కల తగవువంటి నైచ్యపు పని గాదా? కరువుకు బాధ్యులెవరని నిందించుకోడంకాదు నేడు దేశభక్తుల కర్తవ్యం; అదిపరిష్కరించడమే వారిపని. ఆంగ్లోఇండియన్‌పత్రిక స్టేట్స్‌మన్ ఈసాకుచూపి పిల్లులమధ్య పోరు కోతి తీర్చినట్లుగా మంత్రివర్గాన్ని తొలగించి, యే పార్టీవారూ లేకుండా అధికారులే ప్రభుత్వం చేయాలనిసలహా యిస్తోంది.

రాజాజీ భీతి

బయటవున్న కాంగ్రెసు నాయకులు సమావేశమయి క్రిప్స్ రాయబారాలు చెడినపుడు ఉన్న షరతులను అంగీకరించుతామని ప్రకటించాలని రాజాజీ 23 తేదీన ప్రకటించాడు. లండనులో ఎడ్గార్‌స్నో క్రిప్స్ సూచనలను పేరుమార్చి యిస్తే కాంగ్రెసు అంగీకరించవచ్చుననే సూచన చేశాడు. అది రాజాజీకి ఆశలు కల్పించివుండవచ్చు. వేచివుండటం నిష్ప్రయోజనమనీ, బలహీనంగా వున్న పక్షమే రాజీకి పూనుకోవాలనీ రాజాజీ చెప్పాడు. పరిష్కారం కొరకు ఆవేదనలో జాతీయ వాంఛను పొందడానికి ప్రజాసమీకరణ అవసరాన్ని రాజాజీ గుర్తించడంలేదు.

అదేవిధంగా జిన్నాజీ పాకిస్తాన్ ఒకటే పరిష్కారానికి మార్గమని మళ్ళీ వల్లించాడు. కాని ముస్లింప్రజల స్వయం నిర్ణయహక్కు భారత ప్రజా ఐక్యత ద్వారానే వస్తుందని గుర్తించడంలేదు. గాంధీజీ బొంబాయి తీర్మానాన్ని ఉపసంహరించుకొంటే ఆయన్ని జైలులో వుంచడానికి ప్రభుత్వానికి సాకే వుండదని జిన్నాజీ ప్రకటించాడు. దీనితోపాటు అతడు గాంధీజీ వగైరా కాంగ్రెస్ నాయకుల విడుదల డిమాండ్ చేయడం తన కర్తవ్యంగా ఎంచాలి. అపుడే భారత జాతీయ ఐక్యతకు పునాది ఏర్పడుతుంది. ముస్లింలు కోరే స్వయంనిర్ణయహక్కు, భారతీయులంతా కోరే జాతీయ ప్రభుత్వం సులభసాధ్యమవుతుంది. ప్రపంచ ప్రజలు కోరుతున్నట్లుగా రాజకీయ ప్రతిష్టంభన తొలగి యుద్ధంలో 40 కోట్ల భారతీయులు తమ కర్తవ్యాన్ని నెరవేర్చగల్గుతారు.

27—9—43.

రొచ్చుగుంట ప్రచారానికి చేయూత నివ్వడం

దేశభక్తుల హోదాకు తగదు

●

(1 వ పేజీ తరువాయి)
గల్లు (కృష్ణా) బహిరంగ సభలో తాను ఫార్వర్డుబ్లాకు వాదినని చెప్పుకొన్నాడు. వణుకూరు (కృష్ణాజిల్లా) బహిరంగసభలో 'బోసుకుజై,' 'టోజోకుజై' అని వాగాడు. వీరు యీవిధంగా ఒకవైపున పంచమాంగదళ కార్యక్రమాన్ని సాగించుతున్నారు. ప్రజా ఉద్యమాలను చీల్చడానికి ప్రతిద్వ-దిగా ప్రత్యేక సంస్థలను కాంగ్రెసు వాదుల సాయంతో నిర్మించడానికి ప్రయత్నించుతున్నారు.

దేశద్రోహుల ఆటలు ఎంతవరకు సాగాయి?

విధ్వంసక కార్యక్రమంతో దేశభక్తులను మోసపుచ్చలేని పంచమాంగదళాలు, నూతన నినాదాలతో ఎంతవరకు ముందుకుపోయాయి? ఈ కొత్త నినాదాలతో కమ్యూనిస్టు వ్యతిరేకతను దేశభక్తులలో ప్రచారం చేయగలిగాయి. కొన్నిచోట్ల కాంగ్రెసు దేశభక్తులను కొందరిని మోసపుచ్చగలిగాయి. గుంటూరులో ఒకకాలేజీలోనూ, తెనాలి, తాడంకి, హైస్కూళ్లలోను, బెజవాడకాలేజీలోను, కాకినాడలో కొలదిమందిని చేర్చి ఆయాప్రదేశాలలో విద్యార్థిఉద్యమాన్ని చీల్చగలిగాయి. కాంగ్రెసుపేరును, గాంధీజీ పేరును వినియోగించి కొన్నిచోట్ల మాత్రం జాతీయ విద్యార్థి సంఘాలను స్థాపించాయి. గుంటూరులో జాతీయ విద్యార్థి మహాసభ జరిపి, కొండా వెంకటప్పయ్యగారి వంటి దేశభక్తుల ఆశీర్వచనాన్ని సంపాదించగలిగాయి. ఇతరచోట్ల పంచమాంగదళ ప్రచారం సాగించుతున్న భూపతి కోటేశ్వర్రావు, మైనేని రామకోటయ్య, చివుకుల వెంకటేశ్వర్లు నాయకత్వం వహించిన సభలోనే దేశభక్తుడు మాట్లాడాడు. దీన్ని వినియోగించుకొని, తాము నిజమైన కాంగ్రెసు వాదులయినట్లు చెప్పుకొంటూ తమ దేశద్రోహ కార్యానికి బలం సంపాదించాలని వీరి ప్రయత్నం.

ముస్లింలీగ్‌పై దాడి

సింగపూర్ నుంచి బోసు, టోకియో, సైగాన్ రేడియోలు ముస్లింలీగ్, జిన్నా బ్రిటిష్ ప్రభుత్వ ఏజెంటని ప్రచారం చేస్తున్నాయి. పంచమాంగదళం అదే ప్రచారాన్ని దేశభక్తులమధ్య జేస్తూ లీగ్-కాంగ్రెస్ ఐక్యత సాధ్యంకాదంటున్నారు గాంధీజీ జైలునుండి జిన్నాతో రాజీకి ప్రయత్నించడం, జాతీయైక్యత అంటే భయపడే బ్రిటిష్‌ప్రభుత్వం వారి సమావేశానికి అనుమతించకపోవడం, అందరు ఎరిగిన విషయమే. గాంధీజీ, కాంగ్రెసు నాయకులు లీగ్-కాంగ్రెస్ ఐక్యత అవసరాన్ని గుర్తించినట్లు గాంధీజీ లేఖే సాక్ష్యం. కాని పంచమాంగదళ దేశద్రోహులకు యీ ఐక్యత యిష్టంలేదు. అందుకే వారు కాంగ్రెస్ లీగ్‌లమధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నించుతున్నారు.

కాంగ్రెసు దేశభక్తుల పాత్ర

పైన పంచమాంగదళం ఆంధ్రరాష్ట్రంలో తన నూతన నినాదాలను ఎలా ఆచరణలో పెడుతూందో వివరించాను. ఈ మోసంలో పడిన కాంగ్రెసు దేశభక్తులు ఎలా కాంగ్రెసు సాంప్రదాయాలకు విరుద్ధంగా దిగజారుతున్నారో చూపుతాను. కమ్యూనిస్టులపై ద్వేషంతో కాంగ్రెసు గౌరవానికి కళంకం తెచ్చేలాగున, ప్రభుత్వ ఏజంట్లు, నీచాతినీచులైన వారితో సహకారం చేయడానికి, చేతులు కలపడానికి, ఎలా సిద్ధమవుతున్నారో వివరించుతాను. ఈ మార్గాలు దేశభక్తుల హోదాకు తగదని మనవిచేసికొంటాను.

రొచ్చుగుంట ప్రచారం

బ్రిటిషు ప్రభుత్వ ఏజెంటు, జస్టిస్‌పార్టీ బంటు, అయిన 'ములుకోల' పత్రిక దాని పుట్టుక మొదలుకొని కాంగ్రెసును దుమ్మెత్తిపోయడమేపనిగా పెట్టుకొంటూ వచ్చింది. 1942 ఆగష్టులో నాయకులను అరెస్టు చేసిన ప్రభుత్వచర్యను సమర్థించింది. ప్రభుత్వ చర్యలే దేశంలో చెలరేగిన అశాంతికి కారణమని కమ్యూనిస్టులం బట్టబయలుజేశాము. అందుకు "ములుకోల" అరాజక ఉద్యమాన్ని పరోక్షంగా బలపరుస్తున్నామని కమ్యూనిస్టులను నిందించింది. మంగళాపురం రైతుల, చల్లపల్లి వ్యవసాయ కూలీల పోరాటాలలో కమ్యూనిస్టులు నాయకత్వం వహించి నడిపారు. చల్లపల్లి జమీందారు సొమ్ము తింటున్న "ములుకోల" అందుకు కమ్యూనిస్టులపై దుష్ప్రచారం చేసింది. ఈరొచ్చుగుంట పత్రిక నైజము ఏమిటంటే - ఎల్లప్పుడు ప్రజా ఉద్యమాలను, వాటి నాయకులను నిందించడమే. గతఆగష్టులో తెనాలిలో 'రణగర్జన'లో యివ్వబడిన పంచమాంగదళ కార్యక్రమాన్ని కమ్యూనిస్టులు బట్టబయలుజేసి, ఆకార్యక్రమమిచ్చిన దేశద్రోహులను కాంగ్రెసు దరికి చేరనివ్వవద్దని దేశభక్తులను హెచ్చరించుతూ కరపత్రం ప్రకటించింది. దీనిపై "ములుకోల" కమ్యూనిస్టులే రణగర్జనను ప్రకటించారని ఎదురునిందవేసింది. అలాంటిది "ములుకోల" పత్రిక. దీనికి నీతి, నియమము లేదు. కాంగ్రెసును, కమ్యూనిస్టులను, అభివృద్ధి కోరే వారందరిని, నిందించడమే దీని రాజనీతి. రొచ్చుగుంటకు వాసనవేయడం ఎలా సహజమో దీనికిది అలవాటైపోయింది.

ఈపత్రిక యిపుడు కమ్యూనిస్టులపై నిందలు వేయడానికి పూనుకొంది. తీవ్రజాతీయవాదులమనే వేషంతో పంచమాంగదళ కార్యక్రమం యిచ్చేవారు యీ దేశద్రోహ పత్రికను కమ్యూనిస్టులపై దుష్ప్రచారానికి తమ బాకాగా వినియోగించుకొంటున్నారు. ఈ ముఠా మోసంలో పడిన దేశభక్తులు కొందరు ఈపత్రికను పంచుతున్నారు కూడా. కాంగ్రెసు సుసాంప్రదాయాలకు విరుద్ధమైన ప్రచారంజేసే యీదేశద్రోహపత్రికను పంచడమంటే, యెంత పతనమో కాంగ్రెసు దేశభక్తులు గమనించాలని మనవి చేయడానికే యీవిషయం వివరించుతున్నాను. రొచ్చుగుంట పత్రికలకు సమాధానం యివ్వడం నా ఉద్దేశ్యంకాదు.

1930–32 ఉద్యమాలలో సోదరీమణులు అనేకమంది కాంగ్రెసు ఉద్యమంలో పాల్గొన్నారు. పోలీసునిర్బంధాలకుగురియై జైళ్ళకు వెళ్ళారు. ఆరోజులలో పోలీసులు, జాతీయ విద్రోహులు కాంగ్రెసు స్త్రీలపై రాజకీయాలలో పాల్గొంటున్నందుకు అనేకనిందలు వేసేవారు. అపుడు కాంగ్రెసువాదులం ఆ జాతీయ విద్రోహుల నిందలను ప్రభుత్వ యేజెంట్లు ఎందుకు వేస్తున్నారో రాజకీయంగా బట్టబయలు చేసేవారము. ఒకసారి వెనుకకు తిరిగి చూస్తే, ఆరోజులలో పనిచేసిన సోదర కాంగ్రెసు దేశభక్తులందరూ ఎరిగిన విషయమే యిది. నేడు కమ్యూనిస్టుపార్టీ మహిళాసంఘంలో పనిజేసే సోదరీమణులకు రాజకీయ విజ్ఞానం కలిగించడానికి ట్రైనింగ్‌క్యాంపులు నడుపుతోంది. ఇందుకు "ములుకోల" పత్రిక, ఆ ముఠాకు చెందిన రొచ్చుగుంట మెదడు కలిగినవారు, కమ్యూనిస్టులపై స్త్రీలను మోసపుచ్చుతున్నారని దుష్ప్రచారం చేస్తూంది. కమ్యూనిస్టులపై ద్వేషంతో గుళ్ళపల్లి రామబ్రహ్మంవంటి సోదర కాంగ్రెసువాది దీనిని పంచుతున్నాడంటేనూ, ఎర్నేని సుబ్రహ్మణ్యంగారివంటి గాంధీభక్తుడు దీనికి ప్రోత్సాహ మివ్వాలని మిత్రులతో చెప్పాడంటేను, నమ్మశక్యంకాదు. ఈసోదరులు ఒకసారి పునరాలోచించుకొంటే తామెలా పంచమాంగదళ ప్రచారంతో మోసపోయి, దేశద్రోహ పత్రికలకు సాయం చేస్తున్నారో వారికే బోధపడుతుంది.

"ములుకోల" పత్రిక, దానితోనియ్యమంది పంచమాంగదళ ప్రచారకులు, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘముచే వసూలు చేయబడిన రాయలసీమనిధిని, కమ్యూనిస్టులు దురుపయోగం చేస్తున్నారనే మరో నిందను ప్రచారం చేస్తున్నారు. మోసపోయినకాంగ్రెసువాదులుకూడా యీ నిందను ప్రచారం చేస్తున్నారు. ఈ కాంగ్రెసు సోదరులకు మనవి ఏమంటే నిధి లెక్కలు ఎప్పటికప్పుడు ప్రకటించబడుతున్నాయి. నిజమైన సందేహాలుంటే రైతుసంఘ ఆఫీసుకువచ్చి లెక్కలు తనిఖీచేసికొండి. అంతేగాని దేశద్రోహ పత్రిక వ్రాతలను ప్రచారం చేయడం కాంగ్రెసు సోదరుల హోదాకు తగనిపని. ఈ సందర్భంలో ఒక ఉదాహరణ యిస్తాను. 1936 లో తిలక్ స్వరాజ్యనిధి విషయమై నెల్లూరులో ప్రకటించబడే జస్టిస్ పత్రిక 'స్వతంత్ర' కాంగ్రెసు నాయకులపై దుష్ప్రచారం చేసింది. కామ్రేడ్ సుందరయ్య ఉపన్యసించుతున్న ఇందుపూర్ బహిరంగసభలో జస్టిస్‌పార్టీకాంగ్రెసుపై నిందలువేసే కరపత్రాన్ని పంచారు. అపుడు కామ్రేడ్ సుందరయ్య సభలోని ప్రజలకు దేశద్రోహులగు జస్టిస్‌వాదులు కాంగ్రెస్ మహాసభపై వేసే నిందలను బట్టబయలుచేశాడు. ఆ కరపత్రాలను పోగుచేయించి ఆసభలోనే తగులబెట్టించాడు. సోదర దేశభక్తులపై దేశద్రోహులుచేసే దుష్ప్రచారానికి దేశభక్తుడు చెప్పవలసిన సరియైన జవాబు అదే. కమ్యూనిస్టులపై నిందలనుమోపే దేశద్రోహులఎడ దేశభక్తులు నెరవేర్చవలసిన కర్తవ్యం అదే.

నానా గోత్రేభ్యః

1939 యుద్ధారంభంనుంచీ రాయిస్టులు ప్రభుత్వ ఏజెంట్లుగా పనిజేస్తున్నారనే సంగతి కాంగ్రెసు వాదులందరు ఎరుగుదురు. రాయిస్టులు పత్రికా శాసనాన్ని జాతీయపత్రికలను అణచివేయడానికి వినియోగించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించుతూ అనేకసార్లువ్రాశారు. ఆంధ్ర రాయిస్టు పత్రిక లయిన 'విహారి', "రాడికల్" "ఆంధ్రలేబర్" పత్రికలు కమ్యూనిస్టులం కాంగ్రెసు నాయకులను విడుదల కొరకు ప్రచారం చేసినందుకు దుమ్మెత్తిపోశాయి. ఫాసిస్టు అనుకూలుర విడుదలకు పనిచేస్తున్నామని యీ ప్రభుత్వ బంట్లు కమ్యూనిస్టు పార్టీని నిందించారు. వీరు యిపుడు "ములుకోల" పత్రికకు సర్టిఫికేట్లు యిస్తూ (1-9-43 ములుకోల) కమ్యూనిస్టులపై నిందలను తాముకూడా ప్రచారం జేస్తున్నారు. భూపతి కోటేశ్వరరావు వగైరాల పంచమాంగదళ ప్రచారానికి బాకాగా వినియోగించుతున్న "జమీన్‌రైతు" పత్రిక కూడా రాజకీయంగా విమర్శించలేక, యిపుడు "ములుకోల" నిందలను ఇమిటేట్ చేస్తూంది.

ఈ విధంగా నానా గోత్రాలవారూ అనగా రొచ్చుగుంట పత్రికలు, రాయిస్టులు, పంచమాంగదళం, కమ్యూనిస్టులను నిందించడంలో ఏకమవుతున్నారు. ఇందులో ఆశ్చర్యం లేదు. వీరిలో ఎవరికీ నిజమైన జాతీయత లేదు. దేశద్రోహానికి, వివిధరూపాలనుమార్గాలుగా ఒకరు బ్రిటిషు బానిసత్వానికి, మరొకరు జపాన్ బానిసత్వానికి మార్గాలుగా మాత్రమే చూపుతారు. అందుచేదేశరక్షణ, స్వాతంత్ర్యం కోసం పోరాడే కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా వీరి కలయిక సహజమే కావచ్చు.

కాని యీ అపవిత్ర కలయికతో కాంగ్రెసు సాంప్రదాయాలలో పుట్టి పెరిగిన కాంగ్రెసు వాదులు, భారతదేశ స్వాతంత్ర్యాన్ని కోరే దేశభక్తులు సంబంధం పెట్టుకోరు. అలా పెట్టుకోడం కాంగ్రెసు దేశభక్తుల హోదాకు తగనిపని. దేశభక్తులు శాంతంగా ఆలోచించుతారనీ, యీరొచ్చుగుంట పత్రికల ప్రచారాన్ని వ్యతిరేకించుతారని ఆశించుతాము. ఏమంటే ఈ దుర్గంధ ప్రసారం చేస్తూన్న దేశద్రోహులు, కోల్పోవడానికి గౌరవ ప్రతిష్టలుగాని, ప్రజా పలుకుబడిగాని లేదు. కాని కాంగ్రెసు దేశభక్తులు అలాంటి దానికి తావుయివ్వడం తమ ప్రతిష్టకే భంగమని తెలిసికోవాలి. కాంగ్రెసు నిర్మించిన గొప్ప సాంప్రదాయాలకు విరుద్ధమని గుర్తించాలి.

కాంగ్రెసు దేశభక్తులకు విజ్ఞప్తి

పైన పంచమాంగదళ ప్రచారకులు కాంగ్రెసు దేశభక్తులనుమోసపుచ్చడానికి చేస్తున్న ప్రయత్నాలను వివరించాను. కొందరు దేశభక్తులు కమ్యూనిస్టులను సాధించుదామనే ఆవేశంతో ఎలా దగాలో పడుతున్నారో స్పష్టపరచాను రొచ్చుగుంట పత్రికల దుష్ప్రచారాన్ని వ్యాపింపచేయడం దేశభక్తులహోదాకు, కాంగ్రెస్ సాంప్రదాయాలకు ఎలా విరుద్ధమో తేటతెల్లం జేశాను. ఇంక నేటి జాతీయ సంక్షోభంలో దేశభక్తులు తమ కర్తవ్యాన్ని ఎలా నెరవేర్చ గల్గుతారో సూచించుతాను.

దేశభక్తులు దేశమంతటా వినిపించు ఆకలి ఆక్రందనాలకు ఆవేదనపడుతున్నారని మాకు తెలుసు. అట్టి దేశభక్తులందరిని ఇదివరకే ఏర్పడివున్న ఆహారకమిటీలలో పనిచేయమని ఆహ్వానించుతాను. ఇదేవిధంగా రైతుసంఘాలలోకి, కూలీ సంఘాలలోకి, యువజనసంఘాలలోకి, తదితర ఉద్యమాలలోకి వచ్చి మాతోపాటు ప్రజా యిబ్బందులను తొలగించడానికి కృషిచేయమని హృదయపూర్వకంగా ఆహ్వానించుతున్నాను. ఏమంటే ప్రజా ఉద్యమాలలో దేశభక్తులకు స్థానముంది. ప్రజాసేవే వారి కర్తవ్యంకూడా. పంచమాంగదళ దగాలోపడి ప్రజాఉద్యమాలను చీల్చవద్దని మనవి చేస్తాను.

పంచమాంగదళం బెంగాలులో కమ్యూనిస్టులను రాజకీయంగాఓడించలేక రహస్యంగా పొడవడానికి పూనుకొంది. అపుడే కొందరి కామ్రేడ్స్‌ను దొంగచాటునుండి పొడిచింది. ఇద్దరి ప్రాణాలను బలిగొంది కూడా. దీనినే జమీన్‌రైతు పత్రిక సమర్థించింది. ఆంధ్ర రాష్ట్రంలోకూడా పంచమాంగదళం అమాయకులను కాంగ్రెసు పేరుతో ప్రోత్సహించి దెబ్బలాటలకు దిగుతోంది. గుంటూరులో కొందరు విద్యార్థులను మోసగించి రౌడీల సహాయంతో జిల్లా పార్టీ ఆఫీసుపై దాడివెడలి ఎర్రజెండాను ఊడబెరికి తగులబెట్టించారు. గుడివాడలో రౌడీలను దెబ్బలాటకు ప్రోత్సహించారు. ఆకస్మికంగా దెబ్బలాటకువచ్చి, "చూశావా! కమ్యూనిస్టులను కొట్టామని" చెప్పుకోవడం వీరికి పరిపాటి అయింది (తెనాలి, గుంటూరు). సిద్ధంగావుండి కమ్యూనిస్టులం కుక్కకాటుకు చెప్పుదెబ్బ' బాగా అంటించితే, లబోలబోమని యేడుస్తూ పోయి (గుడివాడ), తాము కాంగ్రెసువారి మనీ, కమ్యూనిస్టులు కొట్టారనీ చెప్పుకోవడం, దేశభక్తుల సానుభూతికోసం ప్రయత్నించడం కూడ వీరి ఎత్తు.

దేశభక్తులకు మామనవి ఏమంటే భూపతి కోటీశ్వర్రావు, మైనేని రామకోటయ్య, చివుకుల వెంకటేశ్వర్రావు వగయిరాలు కాంగ్రెసు వాదులుకారు. వారివి పంచమాంగదళచర్యలు. అట్టివారికి అండ యివ్వడం కాంగ్రెసు గత 8 యేండ్లుగా అనుసరించిన ఫాసిస్టు వ్యతిరేక పంథాకు విరుద్ధమయినది. భూపతి కోటీశ్వర్రావుకు మీటింగులను యేర్పాటు చేయడం, అనంతవరంసభకు గాంధి (మిగతా 6 వ పేజీ)

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE